ప్రజాశక్తి

సోమవారం 2 సెప్టెంబర్ 2024 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

ముంపు-ముప్పు

సత్తెనపల్లి, తాడేపల్లి మండలాల్లో ముంపుబారిన పడ్డ పైర్లు

- లంక గ్రామాలు విలవిల
- 12 మండలాల్లో బాధితుల తరలింపు
- లక్ష ఎకరాల్లో పైర్లు మునక
- పల్లపు ప్రాంతాల్లో తొలగని వర్షపు నీరు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ముంపు ప్రభావంతో ప్రజలు అల్లాడుతున్నారు. సోమవారం కూడా వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో అధికారులు అప్రమత్తమయ్యాయి. సిఎం ఆదేశాలతో సోమవారం విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. ఇప్పటికీ పలు ప్రాంతాల్లో రోడ్లపై వర్షం నీరు పారుతోంది. ప్రకాశం బ్యారేజికి ఆదివారం రాత్రి 10 గంటలకు 10.10 లక్షల క్యూసెక్కుల నీరు వరద నీరు వచ్చి చేరడంతో కృష్ణా పరివాహక ప్రాంతంలో ముంపు సమస్య ఏర్పడింది. దాచేపల్లి నుంచి రేపల్లె వరకు దాదాపు 50 లంక గ్రామాలు, పరిసర ప్రాంత పొలాలు ముంపు బారిన పడ్డాయి.

పెదకాకాని మండలంలో నీటమునిగిన పొలాలు పరిశీలిస్తున్న సిపిఎం బృందం

గుంటూరు జిల్లాలో 68 వేల ఎకరాలు, పల్నాడు జిల్లాలో 32 వేల ఎకరాలు ముంపులో చిక్కుకున్నాయి. వీటిలో సాగు చేసిన పత్తి, మిర్చి,వరి, పసుపు, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. వరద ▶ 2లో

కృష్ణమ్మ ఉగ్రరూపం

- బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ
- మహానాడు ఇళ్లకు తాకిన వరదనీరు
- రామయ్యకాలనీలో మంత్రి లోకేష్ పర్యటన



ప్రజాశక్తి-తాడేపల్లి

భారీ వర్షాలతో ఆదివారం ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చింది. నాగార్జున సాగర్‌తో పాటు పులిచింతల నుంచి దిగువకు నీరు విడుదల చేయడంతో మున్నేరు, కట్లేరు తదితర వాగులు పొంగిపొర్లడంతో బ్యారేజీ 7.83 లక్షల క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా అదే స్థాయిలో నీటిని బ్యారేజీకి ఉన్న 70 గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. 15 ఏళ్ల తర్వాత ఇంత పెద్దఎత్తున వరద నీరు రావడం ఇదే తొలిసారని స్థానికులు చెబుతున్నారు.

తాడేపల్లి పట్టణంలో మంత్రి నారా లోకేష్ పరిశీలన

అధికారులు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. పుష్కర ఘాట్ల మెట్లను వంద మూడొంతులు ▶ 2లో

జ్వర పీడితులకు మెరుగైన వైద్యం అందించాలి

వర్షంతో పైర్లు దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి : సిపిఎం

2 లో

53 కుటుంబాలకు పునరావాసం

బాధితులకు భోజనాలు వడ్డించిన పల్నాడు జిల్లా కలెక్టర్, ఎస్పీ

2 లో

నేటి కలెక్టర్ గ్రీవెన్స్ రద్దు

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా

భారీ వర్షాల కారణంగా నేడు కలెక్టరేట్లలో సోమవారం నిర్వహించాల్సిన గ్రీవెన్స్ రద్దు చేసినట్లు గుంటూరు జిల్లాల కలెక్టర్లు ఎస్.నాగలక్ష్మి, పి.అరుణ్‌బాబు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ప్రజలు ఈవిషయాన్ని గమనించి సహకరించాలని కోరారు. అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని విజ్ఞప్తి చేశారు.

యథావిధిగానే జిఎంసి గ్రీవెన్స్

గుంటూరు నగరపాలక సంస్థలో నగర కమిషనర్ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం జరిగే గ్రీవెన్స్ నేడు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు యథావిధిగానే నిర్వహిస్తామని కమిషనర్ పి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలివ్వొచ్చని పేర్కొన్నారు.



నీళ్లల్లో తేలియాడుతున్న గ్రంథాలయంలోని పుస్తకాలు

వాననీటి బారిన విశ్వవిజ్ఞానం

ప్రజాశక్తి - ఎఎన్‌యు : వర్షాల నేపథ్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గ్రంథాలయాన్ని నీరు ముంచెత్తింది. గ్రంథాలయం గ్రౌండ్‌ఫ్లోర్‌లోని పుస్తకాల ర్యాక్‌లలోకి వర్షపు నీరు వచ్చి ఎంతో విజ్ఞానాన్ని అందించే వందలాది పుస్తకాలు నీట మునిగాయి. భారీ వర్షాలపై మూడ్రోజులుగా వాతావరణ శాఖ, ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేస్తున్నా వర్సిటీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకోలేదనే విమర్శలు వస్తున్నాయి. దీనికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

ప్రకాశం బ్యారేజీకి రికార్డు స్థాయి వరద

10.10 లక్షల క్యూసెక్కుల నీరు రాక

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : ప్రకాశం బ్యారేజికి ఆదివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో 10.10 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చింది. ఇంత వరద ప్రవాహం దాదాపు 15 ఏళ్ల తరువాత వచ్చిందని అధికారులు తెలిపారు. 2009లో కృష్ణా నదికి వరదలు వచ్చిన సమయంలో ప్రకాశం బ్యారేజికి ఒకే రోజు 10 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. ఎగువ నుంచి పులిచింతల నుంచి 6.02 లక్షల క్యూసెక్కుల వస్తుండగా ప్రకాశం బ్యారేజి ఎగువన ఉన్న మున్నేరు, కట్టలేరు,బుడమేరు తదితర వాగుల ద్వారా మరో 4 లక్షల క్యూసెక్కుల వరద వస్తోంది. బ్యారేజి కి ఉన్న 70 గేట్లు ఎత్తి నీటిని మొత్తం నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. బ్యారేజి వద్ద రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. పులిచింతల నుంచి వచ్చే నీటి పాటు పులిచింతల దిగువన, కృష్ణా, ఖమ్మం జిల్లాల్లో కురిసిన భారీ వర్షంకు వచ్చే వరద నీటితో ప్రకాశం బ్యారేజికి భారీగా వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. ఎన్.టిఆర్. కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలోని వివిధ మండలాల పరిధిలో 50 గ్రామాలు ముంపు బారిన పడ్డాయి. నాగార్జున సాగర్ జలాశయంకు వరద పోటు పెరిగింది. సాగర్ జలాశయంకు 4.83 లక్షల క్యూసెక్కుల నీరు వస్తుండగా వచ్చిన నీటిని వచ్చినట్టు డ్యామ్‌కు ఉన్న 26 క్రస్ట్ గేట్ల ద్వారా 5.16 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు కాగా ప్రస్తుతం 588 అడుగులవద్ద నీరు నిల్వవుంది. జలాశయం పూర్తిస్థాయిలో నిండింది.

వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : అధిక వర్షాలకు నివాస ప్రాంతాలలో వరద నీరు ప్రవహించి ఇబ్బందులు పడుతున్న పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట శివారు ప్రాంతాలలో ఆదివారం ఎస్సీ కాలనీల్లోని 200 పేద కుటుంబాలకు బియ్యం పంపిణీ చేసినట్లు జనసేన రాష్ట్ర ప్రచార కమిటీ జాయింట్ సెక్రటరీ బెల్లంకొండ అనీల్ అన్నారు. ఈ కార్యక్రమానికి నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలాని హాజరయ్యారు. అనీల్ మాట్లాడుతూ నరసరావుపేట నియోజకవర్గంలో ఎటువంటి ఆస్తి ప్రాణ నష్టం వాటిల్లలేదన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిన నేపథ్యంలో ఎక్కడా వర్షపు నీరు నిల్వ ఉండలేదన్నారు.

మరమ్మతులు చేపట్టక.. ముంపు తప్పక..

ప్రజాశక్తి - పొన్నూరు : పుష్కర కాలంగా పొన్నూరు పరిసర ప్రాంతాలలోని పంట కాల్వలు, మురుగు కాల్వలకు పూడికతీత పనులు, కట్టలు పటిష్టం చేయకపోవడం, తాజాగా కుండపోత వర్షాలకు పొన్నూరు పరిసర ప్రాంతాల్లో వరి పొలాలు నీట మునిగాయి. కొద్దిపాటి వర్షానికి మురుగునీరు ఎగదన్ని వరి పైర్లు వరద ముంపుకు గురవుతున్నాయి. మండలంలోని కసుకర్రు, ములుకుదురు, మాచవరం తదితర గ్రామాలలోని రైతులు తీవ్రంగా నష్టపోయారు. సుమారు వెయ్యి ఎకరాల్లో వరి పొలాలు వరద ముంపుకు గురయ్యాయి. పొన్నూరు పట్టణంలోని డ్రెయినేజిలోని మూడొంతులు నీరు మురుగు కాల్వలో చేరటం వల్ల కసుకర్రు తదితర గ్రామాల్లోని వరి పొలాలు తరచూ వరద ముంపుకు గురవుతున్నాయి. దీనివల్ల భూగర్భ జలాలు సైతం ఉప్పుగా మారి సాగు, తాగు నీరు కలుషితమవుతున్నాయి. ఈ కారణంగా పంట దిగుబడులు తగ్గటమే కాకుండా, రైతులు అదనంగా పెట్టుబడి పెట్టి తిరిగి రెండవ దఫా వరి నాట్లు వేసుకోవాల్సిన పరిస్థితి దాపురిస్తోంది. ఇప్పటికే రైతులు ఎకరానికి సుమారు రూ.20 వేల చొప్పున పెట్టుబడిగా ఖర్చు చేశారు. ఓల్డ్ తుంగభద్ర డ్రెయిన్ మురుగు కాల్వకు అడుగున కాంక్రీట్‌తో కాల్వ నిర్మాణం చేపట్టి ఉప్పునీరు పొలాల్లోకి ఇంకకుండా ఇరిగేషన్ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు అభివృద్ధి సేవా సంఘం అధ్యక్షులు పూల సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. పెదఇటికంపాడు వద్ద కొల్లిమర్ల డ్రెయిన్ మురుగునీరు పొలాల్లోకి వెళ్లకుండా షట్టర్ నిర్మాణం చేపట్టాలని ఆయన కోరారు.

జ్వర పీడితులకు మెరుగైన వైద్యం అందించాలి

పైర్లు దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

మాట్లాడుతున్న గుంటూరు విజయ్‌కుమార్

వాతావరణంలో మార్పులు, భారీ వర్షాల కారణంగా పల్నాడు జిల్లాలో జ్వరాలు విపరీతంగా ఉన్నాయని, జ్వర పీడితులకు ప్రభుత్వం మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ప్రభుత్వాస్పత్రుల్లో మందులు, వైద్య సిబ్బంది కొరత లేకుండా చూడాలన్నారు. సిపిఎం పల్నాడు జిల్లా కమిటీ సమావేశం స్థానిక పుతుంబాక భవన్‌లో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ జ్వరాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వైద్యశిబిరాలు నిర్వహించాలన్నారు. భారీ వర్షాలకు వాగులు పక్కన ఉన్న పొలాలు కోతకు గురై పంట నష్టం వాటిల్లిందని, బాధిత రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని సత్వరమే అమలు చేయాలని, పెట్టుబడి సాయాన్ని కౌలురైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల వారిని అప్రమత్తం చేయడంతోపాటు పునరావాసం కల్పించాలన్నారు. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు గద్దె చలమయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.ఆంజనేయులు నాయక్, జి.రవిబాబు, ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

53 కుటుంబాలకు పునరావాసం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మండల కేంద్రమైన అచ్చంపేటలోని వీరభద్ర కాలనీ వాసులకు గ్రామంలోని జెడ్‌పి పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆదివారం సందర్శించారు. 53 కుటుంబాలకు చెందిన 120 మందికి ఏర్పాటు చేసిన భోజనం వడ్డించారు. కాలనీలో పరిస్థితులు మెరుగయ్యేవరకూ పునరావాస కేంద్రాన్ని కొనసాగించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కాలనీని సందర్శించి నీరు తగ్గగానే పారిశుధ్య కార్యక్రమాలు చేపడతామన్నారు. గండిపడిన దోసపాడు చెరువును సందర్శించి పనులను పర్యవేక్షించారు. సత్తెనపల్లి ఆర్డీవో మురళీకృష్ణ, అచ్చంపేట తహశీల్దార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కృష్ణమ్మ ఉగ్రరూపం

(మొదటి పేజీ తరువాయి)

ముంచేసింది. అక్కడున్న శివలింగాన్ని తాకుదామా అన్నట్లు కృష్ణమ్మ పొంగి ప్రవహిస్తోంది. కృష్ణానది రైలు బ్రిడ్జి వద్ద రైలు పట్టాలను తాకడానికి రెండడుగుల దూరంలో వరద ప్రవహిస్తోంది. సుందరయ్యనగర్‌లోని మహానాడు ప్రాంతంలో కృష్ణానది 20 అడుగుల మేర నీటితో ప్రవహిస్తోంది. ఈ ప్రాంతంలో ఇళ్లల్లోకి, రోడ్లపైకి వరద నీరు వచ్చి చేరింది. సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, నాయకులు వి.దుర్గారావు, డివి భాస్కరరెడ్డి, డి.విజయబాబు, బి.రామారావు, ఎం.నాగేశ్వరరావు, బాష, కొండబాబు, కె.ప్రభాకరరావు, ఎం.మల్లేశ్వరి, లక్ష్మి, వెంకన్న తదితరులు బాధితులను పరామర్శించారు. నదీ ఒడ్డునున్న ఇళ్లల్లోని వారు అప్రమత్తంగా ఉండాలని కోరారు. డ్రెయినేజీ అస్తవ్యస్తంగా మారిందని, అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని కోరారు. పట్టణంలోని పలు కాలనీలు శనివారం నుండి నీటితో నానుతూనే ఉన్నాయి. నులకపేటలోని ఎమ్మెల రామయ్యకాలనీ పూర్తిగా నీటమునిగింది. మంత్రి నారా లోకేష్ ఆదివారం ఈ ప్రాంతంలో పర్యటించగా పరిస్థితిని సిపిఎం పట్టణ నాయకులు బి.వెంకటేశ్వర్లు, నాయకులు వి.దుర్గారావు, టిడిపి పట్టణ అధ్యక్షులు వి.వెంకట్రావు, కె.వెంకటేశ్వరరావు వివరించారు. రోడ్లు, డ్రెయినేజీ సమస్య పట్టిపీడిస్తోందని చెప్పారు. రామయ్య కాలనీలోని వర్షం నీటిని బయటకు తోడించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పోతురాజుస్వామి గుడి, విజయవాడ క్లబ్ వైపు, సుందరయ్య నగర్‌లోని కొంత భాగం, బోటుయార్డు, గుంటూరు హెడ్ స్లూయిస్ వద్ద గల పుష్కర కాలనీ ఇంకా నీటిలో నానుతూనే ఉన్నాయి. కృష్ణానది ఒడ్డున మానస సరోవరంలోని పిరమిడ్ ధ్యాన ఆశ్రమంలోకి వరద నీరు వచ్చింది. ఇదిలా ఉండగా వానల వల్ల రెండ్రోజుల నుంచి పనుల్లేక పేదలు పలు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యావసరాలతో పాటు ఆర్థిక సాయం అందించాలని కోరుతున్నారు.

పోతురాజుస్వామి గుడి, రన్నింగ్ రూమ్ సెంటర్ తదితర ప్రాంతాల్లో వైసిపి పట్టణ అధ్యక్షులు బి.వేణుగోపాలసోమిరెడ్డి, ఎం.ప్రకాష్, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి టి.వెంకటయ్య పర్యటించి ఇబ్బందులపై స్థానికులతో మాట్లాడారు. మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రమాదభరితంగా కొండ చరియలు

సీతానగరంలోని కొండచరియలు ప్రమాదభరితంగా ఉన్నాయి. ఎప్పుడైనా కింద పడే ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ మార్గం గుండా నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. కొన్నిచోట్ల ఇప్పటికే కొండచరియలు కిందకు జారి ఉన్నాయి. గతంలో ఈ ప్రాంతంలోనే కొండచరియలు విరిగి పడ్డాయి. ప్రమాదం జరగకముందే అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వాగు ఆనవాలు కనిపించడంలేదు

ఉండవల్లి వద్ద కొండవీటి వాగు ఆనవాలు కనిపించడంలేదని, దీని వల్ల పంట పొలాలకు ముంపు

పొంచి ఉందని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు ఆందోళన వ్యక్తం చేశారు. అనంత పద్మనాభస్వామి గుహల వద్ద సిపిఎం, రైతు సంఘం నాయకులతో కలిసి ఆయన వరద ఉధృతిని, కొండవీటి వాగులో పేరుకుపోయిన తూటుకాడ, గుర్రపుడెక్కను పరిశీలించారు. సిఎం చంద్రబాబు ఇంటికి వెళ్లే దారి మొదట్లో వాగుపై నిర్మించిన బ్రిడ్జి వద్ద తూటుకాడ, గుర్రపుడెక్క పేరుకుపోయిందని చెప్పారు. దీని వల్ల నీరు వాగులో ఎగదన్ని పంట పొలాలను ముంచెత్తె ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే వాగును శుభ్రం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కె.ఈశ్వరరెడ్డి, ఆర్‌వి రాఘవయ్య, సిహెచ్.సాంబయ్య పాల్గొన్నారు.

ఎత్తిపోతల వద్దకు భారీగా చేరుతున్న వరదనీరు

కొండవీటి వాగు ఎత్తిపోతల పథకం వద్దకు భారీగా వరద నీరు వస్తోంది. ఇప్పటికే రెండు సంపుల ద్వారా వాగులోకి నీటిని డంపు చేస్తున్నారు. ఉధృతి పెరిగితే మిగతా నాలుగు సంపుల ద్వారానూ నీటిని పంపడానికి ఏర్పాట్లు చేసినట్లు ఇరిగేషన్ అధికారులు చెప్పారు.

ముంపు-ముప్పు

(మొదటి పేజీ తరువాయి)

నీటిలో చిక్కుకున్న పొలాల్లో నీటిని బయటకు పంపేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. గుంటూరు, మంగళగిరి, తెనాలి బస్టాండ్లలో వర్షం నీరు చేరింది. బస్సులకు లోపలికి వెళ్లేందుకు, డిపోల నుంచి బయటకు వచ్చేందుకు ఆర్‌టిసి సిబ్బంది, ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారు. ఆదివారం సాయంత్రం వరకు గుంటూరు బస్టాండ్ లోపలికి బస్సులు వెళ్లలేదు. గుంటూరులోని ముంపు ప్రాంతాల్లో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు నశీర్ అహ్మద్, గళ్లా మాధవి సందర్శించారు. ముంపు ప్రాంతాల్లో సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, గుంటూరులో సిపిఎం నగర కార్యదర్శి నళినీకాంత్ పర్యటించారు. తుళ్లూరు మండలం వెంకటపాలెం, హరిశ్చంద్రపురం, రాయపూడి, ఉద్దండ్రాయునిపాలెం తదితర గ్రామాలకు చెందిన లంక ప్రాంత వాసులను అధికారులు పునరావస శిబిరాలకు తరలించారు. ప్రకాశం బ్యారేజికి భారీగా వరద నీరు రావడం వల్ల ఉమ్మడి జిల్లాలోని పలు లంక గ్రామాలు జలదిగ్బంధనంలో చిక్కుకున్నాయి. కొల్లూరు మండలంలోని 9 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తాడికొండ మండలం పొన్నెకల్లుకు చెందిన పగడాల రాఘవ (39) గుంటూరు నుంచి స్వగ్రామానికి వెళ్లేందుకు దామరపల్లి మీదుగా వెళ్తుండగా కొండవీటి వాగులో చిక్కుకుని మృతి చెందారు. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం తంగెడ వద్ద వరద దాటికి తంగెడ కృష్ణా నదిలో మూడు బోట్లు, రెండు తొట్టి పడవలు కొట్టుకుపోయాయని జాలర్లు వాపోయారు. తమకు జీవనాధారమైన పడవలు కొట్టుకు పోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధిత జాలర్లు సహాయం కోసం ఎదురు చూస్తున్నారు.

కాకుమాను మండలం కొండపాటూరులో నల్లమడ వాగు గండిపడి పొలాల మీదకు పెద్ద ఎత్తున వరద నీరు ప్రవహించింది, వాగు పొంగి గండి పడటంతో పక్కన ఉన్న పొలాల్లోకి వచ్చింది, సుమారుగా 600 ఎకరాల్లోని వరి పంట ముంపుకు గురైంది. అమరావతి మండలంలో వైకుంటపురం, అమరావతి, గిడుగు, పొందుగల, మునుగోడు ,ధరణికోట లంక గ్రామాలలో తమ గొర్రెలను మేపుటకు గత 20 రోజుల క్రితం వెళ్లి వరదలో చిక్కుకున్న 36 మందిని వారి 1500 గొర్రెలను అధికారులు కాపాడారు. అచ్చంపేట మండల పరిధిలోని కొనూరు, కస్తల, చామర్రు లంక గ్రామాలలో చిక్కుకొన్న 14 మందిని వారి 2001 గొర్రెలను వెరసి మొత్తం 50 మందిని మరియు 3501 గొర్రెలను పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు చొరవతో 14 బోట్ల ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. దాచేపల్లి మండలం రామాపురం మత్స్యకారుల కాలనీని వరద నీరు చుట్టుముట్టింది. 50 కుటుంబాలను అధికారులు పునరావస కేంద్రాలకు తరలించారు. పడవలలో గ్రామస్తులను పునరావస కేంద్రాలకు తీసుకువెళ్లారు. తుళ్లూరు, కొల్లిపర, తాడేపల్లి మండలాలకు చెందిన పలు లంక గ్రామాలను ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం, ఉద్దండ్రాయునిపాలెం, రాయపూడి పరిసర ప్రాంత వాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తాడికొండ అడ్డరోడ్డు లాం దగ్గర కొండవీటి వాగు పొంగిన చప్టా వద్ద కుంభ రవి అనే విద్యార్థి కొట్టుకుని పోయి తుమ్మ చెట్లకి పట్టుకుని ఉన్నాడు. అతన్ని అగ్నిమాపక సిబ్బంది రక్షించారు. ఆదివారం రాత్రి తుళ్లూరు మండలంలోని పునరావస కేంద్రాలను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మీ, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ సందర్శించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపి ఆదేశాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పెదకాకాని మండలం ఉప్పలపాడు వాగు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు, ఉపాధ్యాయుడు మృతి చెందిన ఘటనపై గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తీవ్రంగా స్పందించారు. ప్రమాదానికి కారణమైన వాగు వద్ద వంతెన నిర్మాణానికి గాను అధికారులకు పెమ్మసాని ఆదేశాలు ఇచ్చారు. ఏ స్థాయి వర్షాలు కురిసినా సరే, మరోసారి ప్రాణనష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని చెప్పారు. ఉప్పలపాడు గొల్లమూడి గ్రామాల మధ్యన త్వరలో వంతెన నిర్మాణానికి సంబంధించిన పనులు ప్రారంభించాలని ఆయన సూచించారు. అలాగే వంతెన నిర్మాణానికి వి.వి.ఐ.టి కళాశాల యాజమాన్యం రూ. 50 లక్షలు సహకారం అందిస్తామన్నారని ఈ సందర్భంగా పెమ్మసాని తెలిపారు.

మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

అనంతరం వర్షాల కారణంగా ఉప్పలపాడు గ్రామంలో జరిగిన పంట నష్టాన్ని కూడా ఆయన పరిశీలించారు. వర్షాల కారణంగా హై లెవెల్ ఛానల్ పొంగి దాదాపు 5 వేల ఎకరాలకు పైగా పంట పొలాలు నీట మునిగాయని పెమ్మసాని వద్ద రైతులు వాపోయారు. గతంలో ఉన్న కల్వర్టు కూలిపోయిన తర్వాత తాము అందరం కలిసి తూములు ఏర్పాటు చేసుకున్నా ఉపయోగం లేకుండా పోయిందని చెప్పారు. తక్షణమే స్పందిస్తూ సంబంధిత శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మల్లికార్జున రావు తో పెమ్మసాని ఫోన్లో మాట్లాడారు. కల్వర్టు నిర్మాణానికి సంబంధించిన ప్రణాళిక త్వరగా సిద్ధం చేయాలని, ఎం.పీ నిధుల ద్వారా వీలైనంత త్వరగా కల్వర్టు నిర్మాణాన్ని చేపట్టాలని ఆదేశించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ కల్వర్టు నిర్మాణం తో పాటు ఉప్పలపాడు-గోల్లమూడి మధ్య కూడా వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని, ప్రజా, రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఈ సందర్భంగా పెమ్మసాని భరోసా ఇచ్చారు. అధికారులు అప్రమత్తంగా ఉండకపోవడం, శెలవు ప్రకటనలో గందరగోళం నెలకొనడం వల్ల విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఇబ్బంది పడ్డారని పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చారు.

లంక గ్రామాలను సందర్శించిన మంత్రి నాదెండ్ల

ప్రజాశక్తి - కొల్లిపర

కృష్ణ వరద ప్రభావిత లంక గ్రామాలను పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదివారం సందర్శించారు. లంక గ్రామాల ప్రజలకు ప్రభుత్వం తరపున భరోసా కల్పించేందుకే తాను లంక గ్రామాల్లో పర్యటించినట్లు తెలిపారు భారీ వరదల వలన ప్రాణ నష్టం, పశు నష్టం, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అధికారం యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ఆయన కోరారు. వరద ముంపు ప్రాంతాల్లో తక్షణసాయంగా ఒక్కొక్క కుటుంబానికి ఐదు కిలోల బియ్యం, పంచదార, పామాయిల్ సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. వరద పరిస్థితిని గురించి ఆ గ్రామాల ప్రజలను అడిగి తెలుసుకున్నారు

తూములు ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

అధిక వర్షాలు కురిసినప్పుడు, పంట పొలాలలో వర్షపు నీరు చేరి, ముంపుకు గురవుతున్నాయని, వర్షపు నీరు బయటకు పోయేందుకు తూములు ఏర్పాటు చేయాలని, ఎంటిఎంసి పరిధిలోని ఇప్పటం టిడిపి గ్రామ ప్రధాన కార్యదర్శి జెముడుగాని రత్తయ్య అన్నారు. ఆదివారం ఇప్పటం గ్రామంలోని సర్వేనెంబర్ 113లో ముంపుకు గురైన 10 ఎకరాల పంట పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రత్తయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో వడ్డేశ్వరం, ఇప్పటం గ్రామాల పొలిమేర డొంక నుండి బకింగ్ హోం కెనాల్‌లో అధిక వర్షాల కారణంగా పొలాలలో నిలబడిన వర్షపు నీరును బయటకు పంపేందుకు, తూములు ఏర్పాటు చేసేందుకు ఖర్చు అంచనా వేశారని అన్నారు. కానీ ఎటువంటి చర్యలు చేపట్టలేదని అన్నారు. రైతులు ఎన్నిసార్లు విన్నవించిన అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. తక్షణమే పంట పొలాల రైతులు పంటలు నష్టపోకుండా తూములు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆయన కోరారు.

ఫుట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్లు ఎంపిక

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

పల్నాడు జిల్లా ఫుట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ పురుషులు మహిళలా జిల్లా ఫుట్‌బాల్ జట్లు ఎంపికలు జరిగాయి. సత్తెనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (సుగాలీ)లో ఆదివారం జరిగిన జిల్లా జట్ల ఎంపికకు జిల్లా నలుమూలల నుండి క్రీడాకారులు హాజరయ్యారు. ఫుట్ బాల్ పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా జుట్టుకు ఎంపిక చేశారు. జిల్లా మహిళా జట్టుకు ఎంపికైన క్రీడాకారిణిలు అక్టోబర్‌లో గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని అలాగే పురుషుల జుట్టుకు ఎంపికైన క్రీడాకారులు అక్టోబర్‌లో

నెల్లూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని పల్నాడు జిల్లా ఫుట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు కె.సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. జిల్లా జట్ల ఎంపికలో ఎస్ కే రియాజ్ సీనియర్ ఉపాధ్యాయులు నాగిరెడ్డి ఏ శ్రీరామ్, శ్రీనివాసరావు ఎస్ఎం సుభాని, సత్యవతి ,అచ్చిరెడ్డి , నరసింహ రావు అనిల్, జాన్ సైదా పాల్గొన్నారు

నిందితులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - క్రోసూరు: పల్నాడు జిల్లా. క్రోసూరు మతిస్థిమితం లేని మైనర్ బాలికపై లైంగిక దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు గార్లపాటి దాసు డిమాండు చేశారు. ఆదివారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాల సెంటర్లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నంద్యాల జిల్లా కోయిలకుంట్లకు చెందిన మైనర్ మతిస్థిమితం లేని బాలికపై ముగ్గురు యువకులు లైంగిక దాడి చేయడం దారుణమన్నారు. ఆ ముగ్గురిపై ఫోక్సో కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారన్నారు. ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ రాష్ట్రంలో బాలికలపై లైంగికదాడులు జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

గాయపడ్డ వ్యక్తికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో దాడిలో గాయపడ్డ రాగన్నపాలెంలోని 27వ వార్డు వైఎస్ఆర్‌సిపి కార్యకర్త కొరివి రంగయ్యకు ఎమ్మెల్సీ మర్రు రాజశేఖర్ రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే నెలలో జరిగిన ఎన్నికల్లో పోలింగ్ బూత్ దగ్గర జరిగిన గొడవలో ప్రత్యర్థి పార్టీ వారి దాడిలో కొరవి రంగయ్య గాయపడ్డారన్నారు. ఆర్థిక ఇబ్బందుల వైద్యం సక్రమంగా అందడం లేదని సాతులూరి కోటి వల్ల తెలుసుకున్న తాను ఈ ఆర్థిక సాయాన్ని అందజేసినట్లు తెలిపారు. ఈ సాయంలో అందజేయడంలో రావూరి దాసు, అడపా రవి, ధనరాజు పాల్గొన్నారు

మహారాజశ్రీ చిలకలూరిపేట ప్రిన్సిపల్ సివిల్‌జడ్జి (జూనియర్ డివిజన్)

బిట్వీన్

ఓఎస్ నెం: 317/23

పైనం జగదీష్, తండ్రి కోటేశ్వరరావు ....వాది

VS

గార్లపాటి వెంకట నరేంద్రబాబు తండ్రి పెద్దలక్ష్మయ్య హిందూ వయస్సు 42సం॥ నివాసం, ప్లాట్‌నెం.308, లలితా హోమ్స్, సుభానీ నగర్, చిలకలూరిపేట, పల్నాడు జిల్లా......ప్రతివాది

పై నంబర్ గల దావాని పరిహారం నిమిత్తం నీమీద దావా దాఖలు చేసి ఉండడం మీరు శ్రీ కోర్టు వారి నుండి ఎన్ని పర్యాయములు సమన్లు పంపిననూ మీరు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ది: 2-09-2024 న ఉదయం 10.30 ని॥ లకు శ్రీ కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా కానీ, న్యాయవాది గారి ద్వారా గాని హాజరై మీకు గల అక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

వాయిదా తేది : 2-09-2024

ఇట్లు
త్రిపురం రామక్రిష్ణ, అడ్వకేట్, నోటరి
చిలకలూరిపేట.

5న కౌలు రైతుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

సిసిఆర్సి కౌలు చట్టాన్ని రద్దు చేసి కౌలు రైతులకు మేలు చేకూర్చేలా నూతన కౌలు చట్టాన్ని రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు అన్నారు. ఐతానగర్ ఎర్రబడి సెంటర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన కౌలు రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 5న విజయవాడలో జరిగే కౌలు రైతుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని

రైతులను కోరారు. వ్యవసాయరంగంలో కీలకపాత్ర పోషించే కౌలు రైతులకు సిసిఆర్సి కౌలు చట్టంవలన ప్రభుత్వం ఇచ్చే రాయితీలు, అన్నదాత సుఖీభవ లాంటి పంటపథకాలు పొందలేక రైతులు నష్టపోతున్నారని అన్నారు. రాఘవయ్య పార్క్ ఎం బి భవన్ లో జరిగే సదస్సుకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, విశ్రాంత ఐఎఎస్ రెడ్డి సుబ్రహ్మణ్యం, మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు తదితరులు పాల్గొననున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివ సాంబిరెడ్డి మాట్లాడుతూ రైతు సంఘాలు ఆందోళనలు కారణంగా 2011 లో సిసిఆర్సి చట్టం వచ్చిందన్నారు. భూయజమానితో సంభందం లేకుండా ఈ చట్టంకోసం రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌలు రైతులు ఎం చిట్టిబాబు, వి సుమంత్, ఎం సురేష్, జి శ్రీనివాసరావు, ఎం జయరావు పాల్గున్నారు.

ఉరి వేసుకుని వివాహిత మృతి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ఉరి వేసుకుని వివాహిత మృతి చెందిన సంఘటన ప్రత్తిపాడు మండల పరిధిలోని చిన్న కొండ్రూపాడులో చోటు చేసుకుంది. పోలీసులు వివరాల మేరకు.. ప్రత్తిపాడు మండలం, చినకొండ్రుపాడు కన్నా శ్రీదుర్గ(24)కు అదేగ్రామానికి చెందిన కన్నా శ్రీనివాసరావు వివాహమైంది. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. శ్రీదుర్గాకు విఫరీతమైన కడుపునొప్పి రావడంతో గుంటూరులోని ప్రైవేటు ఆస్పత్రిలో చూపించారు. అయినా తగ్గకపోవడంతో తాలలేని నొప్పితో జీవితంపై విరక్తి చెంది శనివారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొని మరణించింది. మృతురాలి తల్లి మణిమేలా అంజమ్మ పిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ప్రతిపాడు హెడ్ కానిస్టేబుల్ బ్రహ్మ నాయుడు తెలిపారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి-ఈపూరు

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పురిల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని ఉప్పరపాలెం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కల్లూరు పేరయ్య ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు వ్యాపించి ఇల్లు పూర్తిగా కాలిపోయింది. లక్ష రూపాయలు ఆస్తి నష్టం జరగగా బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. ఇల్లు కాలిన ప్రాంతాన్ని టిడిపి సీనియర్ నాయకులు అయినాల కోటేశ్వరరావు, కూరాకుల శ్రీనివాసరావు సందర్శించి పేరయ్య కుటుంబాన్ని పరామర్శించారు.

13 మంది జూదరుల అరెస్టు

ప్రజాశక్తి - రెంటచింతల

మేజర్ పంచాయతీ, రెంటచింతల పరిధిలో జూదం ఆడుతున్న 13 మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై సిహెచ్ నాగార్జున తెలిపారు వారి వద్ద నుండి రూ.82,930 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. మండలంలో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే తమ దృష్టికి తేవాలని వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

ఇద్దరు వీఆర్‌ఏలకు షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి-ఈపూరు

విధుల పట్ల అలసత్వం వహించిన ముప్పాళ్ళకు చెందిన ఇద్దరు వీఆర్‌ఏలకు షోకాజ్ నోటీసులను తహసిల్దార్ ఎ నలిని జారీ చేశారు. భారీ వర్షాల కారణంగా గ్రామ సమీపంలో వాగు పొంగి ప్రవహిస్తున్నందున ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టేందుకు రెవిన్యూ అధికారులు ఫోన్ చేసినప్పటికీ వీఆర్‌ఏలు జాస్తి అనిల్, గండూరి జాన్ సైదాలు స్పందించకపోవడం, అందుబాటులో లేకపోవడంతో పాటు, వీఆర్‌ఏ విధులు సక్రమంగా నిర్వహించడం లేదని గ్రామస్తులు ఫిర్యాదు చేసిన క్రమంలో షోకాజ్ మెమో ఇచ్చినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

అటవీ భూములు అక్రమిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

అటవీశాఖకు చెందిన భూములు అక్రమిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అనిల్ కుమార్ హెచ్చరించారు.చింతలతండాకు చెందిన కేతావత్ శంకర్ నాయక్ అనే వ్యక్తి చింతల తండా-సాగర్ ప్రధాన రహదారిలోని తన పొలం పక్కనే ఉన్న అటవీశాఖ భూమిని అక్రమించడంతో సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు ఆదివారం సంఘటనా స్థలానికి చేరుకొని శంకర్ నాయక్‌కు నోటీసులు అందజేశారు. ఆక్రమిత స్థలంలో అటవీ మొక్కలు నాటనున్నట్లు అనిల్ కుమార్ తెలిపారు. ఆయన వెంట అటవీశాఖ సిబ్బంది ఉన్నారు.

నీట మునిగిన పైర్లు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్: మండలంలోని కట్టమూరు, దీపాలదిన్నెపాలెం, అబ్బూరు, కందులవారిపాలెం, పాకాలపాడు, భృగబండ, గ్రామాల్లో ఎద్దు వాగు ఉధృతికి మెట్ట, మాగాణి పొలాలను నీరు ముంచేత్తింది. పలు పైర్లు నీటిలో నానుతున్నాయి. గ్రామాల్లో అంతర్గత రహదారులు అధ్వాన్నంగా మారాయి. రెంటపాళ్ళ - దీపాలదిన్నెపాలెం, కట్టమూరులోని లోలెవల్ చప్టాలపై నీటి ప్రవాహంతో రాకపోకలకు ఆటంకం ఏర్పడింది.

నష్టపోయిన రైతుల్ని ఆదుకోవాలి : కౌలురైతు సంఘం

వర్షాలకు పంట నష్టపోయిన రైతులను తక్షణం ఆదుకోవాలని కౌలురైతు సంఘం మండల కార్యదర్శి పి.మహేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెంటపాళ్లలో దెబ్బతిన్న పత్తి పొలాలను నాయకులు ఆదివారం పరిశీలించారు. మహేష్ మాట్లాడుతూ రైతులను ఆదుకుంటామని ప్రభుత్వం ప్రకటించిందేగాని ఎలాగో స్పష్టతివ్వలేదన్నారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని, ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని అమలు చేయాలని కోరారు. పరిశీలనలో కౌలు రైతులు పి.మురళి, టి.వెంకటేశ్వర్లు, ఎం.రామారావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకూరపాడు : ఆపరాల పంటలైన సోయా చిక్కుడు, పెసర, మినుముకు భారీ నష్టం వాటిల్లే ప్రమాదం ఏర్పడింది. వర్షానికి నల్లరేగడి నేలలు, పల్లపు భూముల్లో పైర్లు నీట మునిగాయి. పత్తిలో పూత, పిందె కూడా రాలే అవకాశముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గాలులు పెద్ద ఎత్తున వీచడంతో పత్తి మొక్కలు ఒరిగాయి. దీనివల్ల కూడా పంటకు నష్టం వాటిల్లే అవకాశం ఉంది. బలుసుపాడు, ఖమ్మంపాడు, పాటిబండ్ల, జలాల్పురం, లింగంగుంట్ల, చిన్నమక్కెనతో పాటు పలు గ్రామాల్లో వాగులు పక్కనున్న భూములు వెయ్యి ఎకరాలు పూర్తిస్థాయిలో దెబ్బతినే ప్రమాదం ఏర్పడింది.

ప్రజాశక్తి - రెంటచింతల : భారీ వర్షాలకు మండలంలో పలు గ్రామాల్లో వాగులు ప్రమాదకర స్థాయిలో పొంగి ప్రవహిస్తున్నాయి. ఆదివారం గోలి వాగు ఉధృతంగా ప్రవహించడంతో మాచర్ల గుంటూరు ప్రధాన రహదారిపై వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి. వాగుకు ఇరువైపులా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

ప్రజాశక్తి - యడ్లపాడు : మండలంలోని పొంగి పొర్లుతున్న వాగులను, నీట మునిగిన పొలాలను మండల ప్రత్యేకాధికారి సుబ్రహ్మణ్యం పరిశీలించారు. సొలస, లింగరావుపాలెం, మైదవోలు, జాలాది గ్రామాల్లో ఆయన పర్యటించారు. వాగుల వద్దకు చిన్నపిల్లలు, పశువుల కాపరులు, పశువుల వెళ్లనివ్వకుండా చూడాలని, వాగులు ఉధృతంగా ప్రవహించే సందర్భంలో ప్రజలు, వాహనదారులు లోలెవెల్ చప్టాలు దాటనివ్వకుండా జాగ్రత్త తీసుకోవాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. పరిశీలనలో ఆర్ఐ ఎం.చక్రవర్తి, విఆర్ఒలు నాగజ్యోతి, ఆదిలక్ష్మి, కె.ఎ.చారి ఉన్నారు.

నేడు రేపు కొండవీడు సందర్శన రద్దు

కొండవీడు ఘాట్ రోడ్డు వెంబడి కొండచరియలు విరిగిపడిన దష్ట్యా, కొండవీడు నగరవనం సందర్శనను సోమ, మంగళవారాల్లో నిలిపేస్తున్నట్లు పల్నాడు జిల్లా అటవీశాఖాధికారి ఎన్. రామ చంద్రరావు తెలిపారు. ఘాట్ రోడ్డుపై పడిన బండరాళ్లను ఆర్అండ్‌బీ శాఖ సహకారంతో తొలగిస్తామని చెప్పారు.

ముంపు నుండి పునరావాసానికి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా విలేకర్లు

భారీ వర్షాల నేపథ్యంలో నీటి ఉధృతి అధికంగా ఉన్న ప్రాంతాల్లో పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదివారం పర్యటించారు. అమరావతి మండలం వైకుంఠపురం, అమరావతి, గిడుగు, పొందుగల, మునుగోడు, ధరణికోట లంక గ్రామాల్లో గొర్రెలను మేపేందుకు 20 రోజుల క్రితం వెళ్లి వరదలో చిక్కుకున్న 36 మందిని, 1500 జీవాలను, అచ్చంపేట మండల పరిధిలోని కోనూరు, కస్తల, చామర్రు లంక గ్రామాల్లో చిక్కుకొన్న 14 మందిని, 2 వేల జీవాలను 14 బోట్ల ద్వారా సురక్షిత ప్రాంతాలకు అధికారులు తరలించేలా ఆదేశించారు. వీరిని ధరణికోటలోని బోర్డు సెంటర్‌కు అధికారులు తరలించారు.

ఇదిలా ఉండగా అచ్చంపేట మండలం దోసపాడు చెరువుకు గండి పడిన ప్రాంతాన్ని కలెక్టర్ పరిశీలించి తక్షణ మరమ్మతులకు అధికారులను ఆదేశించారు. అమరావతి, క్రోసూరు, నాదెండ్ల మండలాలు జలమయం అయ్యాయని, ఆయా ప్రాంతాలలో ప్రజలను దగ్గరలోని జెడ్‌పి పాఠశాలల్లో పునరావాస కేంద్రాలకు తరలించామని చెప్పారు. ఇప్పటివరకు 6 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి 2 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు. వర్షాల అనంతరం పారిశుధ్య పనులు, వైద్యశిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. రోజూ లక్ష క్యూసెక్కుల నీరు నదిలో చేరుతున్న నేపథ్యంలో మత్స్యకారులు వేటకు వెళ్లద్దని సూచించారు. పడవల ద్వారా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామన్నారు. ప్రాణ, ఆస్తి నష్టం లేకున్నా కొంత మేర పంట నష్టం వాటిల్లిందన్నారు. వరద ఉధృతి తగ్గగానే పంట నష్టం అంచనాలకు బృందాలను పంపి నివేదికలు ప్రభుత్వానికి అందచేసి బాధిత రైతులను ఆదుకుంటామని చెప్పారు. పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ

జీవాల తరలింపు సహాయక చర్యలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

లోతట్టు ప్రాంతమైన వీరబద్ర కాలని ప్రాంత ప్రజలను అచ్చంపేట జెడ్‌పి పాఠశాలకు తరలించి వారికి అన్ని వసతులు కల్పించామన్నారు. రానున్న రోజుల్లో గండి పడే ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపడతామన్నారు. పరిశీలనలో సత్తెనపల్లి ఆర్డీఓ మురళి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కుండపోత వర్షాలకు క్రోసూరు మండలంలోని పలు గ్రామాలను నీరు ముంచెత్తింది. ఎస్టీ కాలనీలో గృహాల్లోకి వరద నీరు చేరడంతో ప్రత్యేకాధికారి పద్మశ్రీ, తహసీల్దార్ శ్రీనివాసరావు, కార్యదర్శి ఆదినారాయణ, వీఆర్వో బ్రహ్మనాయుడు, ఉపసర్పంచ్ షేక్ మస్తాన్, ఎస్ షఫీ, టిడిపి నాయకుల సహకారంతో జెడ్‌పి పాఠశాలలో వసతి, భోజనం ఏర్పాటు చేశారు. పునరావాస కేంద్రాన్ని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పరిశీలించారు. గత 40 సంవత్సరాల నుంచి తమ పరిస్థితి ఇలాగే ఉందని ఎమ్మెల్యేకు కాలనీ వాసులు విన్నవించగా సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీనిచ్చారు. అనంతరం క్రోసూరు చెరువు కట్టను పరిశీలించి బలహీనంగా ఉన్న ప్రదేశంలో మరమ్మతులకు అధికారులను ఆదేశించారు. నాయకులు కె.కాశయ్య, జి.బాషా, ఎన్.కోటేశ్వరరావు, సలాం, ఎంపిడిఒ మహేష్‌బాబు, చంటి, ఎం.రామాంజనేయులు, డి.యోహాను, ఖలీల్, ఎం.శ్రీనివాసరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యాసంస్థలకు నేడు సెలవు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు సోమవారం పల్నాడు జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు ప్రకటించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. అధిక వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించిన దృష్ట్యా నిబంధనలు అతిక్రమించి విద్యా సంస్థలు సోమవారం నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఆక్రమణల తొలగింపు, డ్రెయినేజీల్లో పూడికతీతతోనే ముంపు సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. గత నెల రోజులుగా ఆక్రమణలు తొలగిస్తుంటే అభ్యంతరాలు చెప్పిన వారే ఇప్పుడు అభినందిస్తున్నారని అన్నారు. పట్టణంలోని వర్ష ప్రభావిత ప్రాంతాలైన గడియార స్తంభం సెంటర్, కళామందిర్ సెంటర్, మార్కెట్ సెంటర్‌లో ఎమ్మెల్యే ఆదివారం పర్యటించారు. పూడికతీతలు మొత్తం పూర్తయిన తర్వాత మార్కింగ్ ఇస్తారని, ఎవరూ నష్టపోకుండా, ఉపాధి కోల్పోకుండా సాయం చేస్తామని చెప్పారు. పూడికతీత వల్ల వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. 50 ఏళ్లలో ఎప్పుడూ ఇంత వర్షపాతం నమోదు కాలేదని చెప్పారు. సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో రాష్ట్రమంతా కొన్ని ప్రాంతాలు ముంపు బారిన పడ్డాయన్నారు. ఇకపై ఎంత పెద్ద వానొచ్చినా పట్టణంలో నీరు నిలబడదని చెప్పారు.

ఇదిలా ఉండగా వర్షాల నేపథ్యంలో మండల పరిధిలోని వాగులు పొంగిపొర్లుతున్నాయి. వాగులను, చప్టాలను తహశీల్దార్ పరిశీలించారు. చిలకలూరిపేట -వేలూరు, కొమిటినేని వారిపాలెం-గోవిందపురం, కమ్మవారిపాలెం గ్రామాల మధ్యలో కుప్పగంజి వాగు చప్టాల మీద నీరు ప్రవహిస్తున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీటి ప్రవాహాల వద్ద రాకపోకలకు వీల్లేకుండా కంచెలు వేయించారు.

మదిలో మెదులుతున్న గతకాలపు ప్రమాదం

ఉధృతంగా పారుతున్న చంద్రవంక

ప్రజాశక్తి- మాచర్ల

శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం అర్ధరాత్రి వరకు మాచర్ల, వెల్దుర్తి, దుర్గి మండలాల్లో భారీ వర్షం కురిసింది. చెరువులు నిండి, వాగులు వంకలు పొంగి పొర్లుతూ మాచర్ల పట్టణం గుండా ప్రవహించే చంద్రవంకలో కలిస్తుండడంతో వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. మాచర్ల నుంచి జమ్మలమడక రహదారిపై వున్న లోలెవల్ బ్రిడ్జిపై, రైలు కట్ట వెంబటి వున్న బ్రిడ్జిపై నుంచి నీరు పారుతోంది. మాచర్ల నుంచి లింగాపురం, జమ్మలమడక గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. గుర్రపుడెక్క, ముళ్లకంపలు ఈ బ్రిడ్జికు అడ్డుపడి నీటి ప్రవాహానికి అవరోదం ఏర్పటడంతో మున్సిపల్ ఛైర్మన్ పోలూరి నరసింహారావు, ఇన్‌ఛార్జి కమిషనర్ నాగేశ్వరరావు ప్రొక్లెయిన్‌తో ముళ్లకంపలను తొలిగింపజేశారు. పొలాల్లోకి నీరు చేరి పత్తిపైరుకు నష్టం వాటిల్లింది. కొన్ని ప్రాంతాల్లోని డ్రెయినేజీ కాల్వలు స్తంభించి మురుగునీరంతా వీధుల్లో మోకాళ్లలోతులో నిలిచింది. పలు గృహాల్లోకి మురుగునీరు చేరటంతో వారి బాధలు వర్ణనాతీతం.

ఆక్రమణల్లో చంద్రవంక

చంద్రవంక వాగు పలు చోట్ల ఆక్రమణలకు గురైంది. కొందరు వాగును పూడ్చి ఇటుక బట్టీలు ఏర్పాటు చేయగా, మరికొందరు గృహాలు నిర్మించుకోవడంతో వాగు కుచించుకుపోయింది. ప్రస్తుతం వర్షాలకు చంద్రవంక ఉధృతంగా పారుతుండటం, ఇటుక బట్టీలు వాగు ప్రవాహానికి అడ్డుగా వుండటంతో మాచర్ల పైఎత్తున చెరువులు తెగి చంద్రవంక ఊరు మీదపడుతుందేమోనని ప్రజలు భయపడుతున్నారు. దీనికి తోడు 60 ఏళ్ల కిందట 1964 సెప్టెంబర్‌లో మాచర్లకు పెద్ద వరదవచ్చి వందలు మంది చనిపోయారు. ఆనాడు జమ్మలమడక రహదారిలో చంద్రవంకపై నాగార్జునసాగర్ కుడికాల్వ బ్రిడ్జి నిర్మిస్తున్నారు. దాంతో ఆ బ్రిడ్జి వద్ద గడ్డిమోపులు, ముళ్లకంప చిక్కుకునిపోయి చంద్రవంక నీరు వెనక్కి తన్నటంతో మాచర్ల మునిగిపోయింది. సరిగ్గా ఇప్పుడు అదే నాగార్జునసాగర్ కుడి కాల్వ బ్రిడ్జి వద్ద మాచర్ల బైపాస్ బ్రిడ్జి నిర్మాణంలో ఉన్నాయి. అనాటి పరిస్థితులు ఇప్పటి పరిస్థితులు సరిపోలుతున్నాయని, చంద్రవంక ఎక్కడ మాచర్లను ముంచుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. తక్షణం చంద్రవంక వాగులోని ఆక్రమణలు తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. బైపాస్ బ్రిడ్జి వద్ద ముళ్లకంపలు అడ్డుపడకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆక్రమణలో దేవాళమ్మ చెరువు

మాచర్ల - నాగార్జునసాగర్ రహదారిలోని ఆర్టీసీ డిపో పక్కన దేవాళమ్మ చెరువువుంది. ఈ చెరువునే పూర్వం మహాదేవి చెరువు అనే పిలిచే వారు. ప్రస్తుత మాచర్లను ఆనాడు మహాదేవిచెరువు అని పిలిచేవారు. పల్నాడు రాజ్యానికి మొదటి రాజధాని కూడా ఈ మహాదేవిచెరువే అనే విషయం ఆధునిక శకం 1111 నాటి మాచర్ల శాసనం ద్వారా తెలుస్తోంది. ఇంతటి చారిత్రక నేపథ్యం వున్న దేవాళమ్మ చెరువు కాలక్రమంలో ఆక్రమణలతో

చంద్రవంక ఒడ్డున ఇటుకబట్టీల నుంచి వస్తున్న వరద నీరు

వర్షంతో నిండిన చెరువులోని కొంత భాగం

కుచించుకుపోయింది. భారీ వర్షాలు కురిసిన ప్రతిసారీ నిండుతోంది. నాలుగేళ్ల క్రితం మాచర్ల మున్సిపల్ రిజర్వాయర్‌లో నీరు నిండుకుంది. దీనికి నాగార్జునసాగర్ కుడికాలువ నీరే ఆధారం. సాగర్‌లో నీరు లేకపోవటం, కుడి కాల్వకు నీరు విడుదల చేయకపోవటంతో మున్సిపల్ రిజర్వాయర్ నిండుకుంది. దాంతో మాచర్ల ప్రజలు కొన్ని రోజులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అదే సమయంలో పెద్ద వర్షం పడటంతో దేవాళమ్మ చెరువు నిండింది. మున్సిపల్ రిజర్వాయర్‌కు దేవాళమ్మ చెరువుకు మధ్యలో 15 అడుగుల సిమెంట్ రోడ్డు మాత్రమే అడ్డు. ఆనాటి మున్సిపల్ అధికారులు ఆ సిమెంట్ రోడ్డు కిందగా కన్నం వేయటంతో చెరువులోని నీరంతా మున్సిపల్ రిజర్వాయర్‌లోకి చేరి జనం నీటి కష్టాలు తీరాయి. పశువుల నీటి అవసరాలనూ ఈ చెరువు తీర్చేది. చెరువులో నీరు వుండటం వలన భూగర్బ జలాలు పెరిగి, బోర్ల కూడా బాగా పనిచేసేయి. ప్రస్తుతం ఈ చెరువులో గుండా మాచర్ల బైపాస్ హైవే రోడ్డు నిర్మాణంతో చెరువు చాలా భాగం కుచించించుకుపోయింది. దీనికి తోడు మరికొన్ని అక్రమ కట్టడాలు కూడా వెలిశాయి. ప్రస్తుతం పెద్ద వర్షం పడినా కూడా చెరువు మొత్తం నిండలేదు. రోడ్డుకు ఒక వైపు వున్న కొంత భాగంలో చేరగా, మరోక భాగంలో నీరు చేరలేదు. ఇందుకు కారణం పాలకుల అనాలోచన నిర్ణయాలు, ఆక్రమణలేనని, తక్షణం ఆక్రమణ తొలగించాలని, హైవే నిర్మాణం చేసే వారు సాధ్యమైనంత వరకు చెరువు దెబ్బతినకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

నీళ్లల్లోనే పేదల నివాసాలు, పొలాలు

ప్రభుత్వం సాయం చేసి ఆదుకోవాలి - జిల్లాలో పర్యటించిన సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

కాజలో ఇళ్లల్లోకి వచ్చిన నీళ్లను పరిశీలిస్తున్న నాయకులు

సహాయ శిబిరాలకు తరలి వెళుతున్న పెదకాకాని సుందరయ్య నగర్ వాసులు

మంగళగిరిలో మగ్గం గుంటలో చేరిన వర్షపు నీరు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరిరూరల్, పెదకాకాని ప్రాంతంలో నీట మునిగిన కాలనీలను, పంట పొలాలను సిపిఎం బృందం ఆదివారం పరిశీలించింది. సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై నేతాజీ, ఈమని అప్పారావు నాయకులు నన్నపనేని శివాజి తదితరులతో కలిసి మండలంలోని కాజా గ్రామంలో నీట మునిగే పంట పొలాలను కాలనీలను సందర్శించి ప్రజల రైతుల బాధలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు నీట మునిగిన పంట పొలాలను సిపిఎం బృందానికి చూపి తమ బాధను వ్యక్తపరిచారు. పుల్లయ్య నగర్ ప్రాంతంలో మహిళలు మాట్లాడుతూ రాత్రంతా ఇళ్లల్లోకి వచ్చిన నీటిని ఎత్తిపోసుకోవడమే సరిపోయిందని కంటిమీద కునుకు లేకుండా పోయిందని, అధికారులు ఎవరు పట్టించుకోవడంలేదని వాపోయారు. ఇళ్లల్లోకి వచ్చిన నీటిని ఎత్తిపోసుకునేందుకు సొంతంగా చందాలు వేసుకుని నీటిని ఎత్తిపోసుకుంటున్నామని అధికారులు కనీసం ఆ చర్యలు కూడా చేపట్టలేకపోయారని తమ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ మంగళగిరి ప్రాంతంలో కురిసిన వర్షాలకు కాలనీలన్నీ నీట మునిగాయని కాలనీలలో నివసిస్తున్న ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. కాజా టోల్గేట్, గ్రామ పంట పొలాలు, కాలనీలన్నీ నీటితో నిండిపోయాయని పంట పొలాలన్నీ చెరువులను తలపిస్తున్నాయని పేర్కొన్నారు. మంగళగిరి ప్రాంతంలో అన్నిచోట్ల ఇదే పరిస్థితి నెలకొని ఉందని చెప్పారు. వ్యవసాయ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇళ్లల్లోకి నీళ్లు చేరి వంట సైతం వండుకునే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం వారి ని ఆదుకోవాలని ఆయన కోరారు. పంట పొలాలు చెరువులను తలపిస్తున్న క్రమంలో రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. నీటి వల్ల పంటలన్నీ పూర్తిగా దెబ్బతినిపోయాయని కొన్నిచోట్ల పంట పొలాల్లో వేసిన పంటలు పనికిరాని పరిస్థితి ఏర్పడిందన్నారు. మరలా పంటలు వేసుకునేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని కోరారు. విత్తనాలను అందుబాటులో ఉంచడం రైతులకు విత్తనాలు అందించడం నష్టపరిహారం లెక్కించి రైతులను ఆదుకోవడం వెంటనే చేయాలని కోరారు.

ప్రభుత్వమే మోటార్లను ఏర్పాటు చేయాలి

వర్షాలకు కాలనీలన్నీ నీట మునిగిన నేపథ్యంలో నీటిని ఎత్తిపోసేందుకు పుల్లయ్య నగర్ ప్రాంత ప్రజలు చందాలతో మోటర్ ఏర్పాటు చేసుకున్నారని, ప్రభుత్వ అధికారులు స్పందించి మోటార్‌ను ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు భీమిరెడ్డి కోటేశ్వరి కోరారు. పుల్లయ్య నగర్ ఏరియాలో కనీసం డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో సమస్య మరింత జటిలంగా తయారైందని చెప్పారు. మురుగునీరు ఇళ్లల్లోకి చేరిందని తెలిపారు. ఈ క్రమంలో మురుగు నీరు వెళ్లేందుకు కాలువలను, రోడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. పరిశీలించిన వారిలో రైతు సంఘం మండల కార్యదర్శి తమ్మా ప్రసాద్ రెడ్డి, సిపిఎం నాయకులు బి. సత్యమారెడ్డి, గాదె గోపాలరెడ్డి, గాదె మాధవ రెడ్డి, చెన్నం కుమారస్వామి, పాలేటి అప్పారావు, భూనం రామారావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్

గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నీట మునిగిన వరి పొలాలను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివ సాంబిరెడ్డి ఆదివారం పరిశీలించారు. తెనాలి గోలిడొంక ప్రాంతంలో రైతులు, కౌలు రైతులతో ఆయన మాట్లాడారు. ఐతానగర్ కు చెందిన జెట్టి కిరణ్ కుమార్ పొలంలో నీటమునిగిన వరి మొక్కలను రైతులతో కలసి క్షుణ్ణంగా పరిశీలించారు. స్థానిక రైతు శ్రీ హర్ష మాట్లాడుతూ ఏటా 70 నుంచి 80 ఎకరాలు కౌలు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాని, ఖరీఫ్ ప్రారంభంలోనే ప్రకృతి కన్నెర్ర చేయడంతో నష్టాన్ని చవిచూడాల్సిన దుస్థితి నెలకుందన్నారు. పొలాలు పరిశీలనకు వచ్చిన వ్యవసాయ శాఖ జిల్లా అధికారి నున్న వెంకటేశ్వర్లుతో సాంబిరెడ్డి మాట్లాడుతూ రైతులకు సిసిఆర్సి కార్డులు మంజూరుకు కృషి చేయాలని, ఎకరానికి రూ 10 వేలు చొప్పున నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు, కౌలు రైతులు ఈదర పూర్ణచంద్, వి సుమంత్, ఎం జయరావు, శివ, కె వెంకటేశ్వరరావు, ఎం సురేష్, ఆరిగ ప్రసాద్, ఆనంతనేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తెనాలి గోలిడొంకలో నీటమునిగిన పొలాలను పరిశీలిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - మంగళగిరి

రెండు రోజులుగా మంగళగిరి పట్టణంలో కురిసిన భారీ వర్షాలు వలన ముంపునకు గురైన రత్నాల చెరువు, మంగళగిరిలోని టిడ్కో గృహాలను ఆదివారం సిపిఎం నాయకులు జెవి రాఘవులు, వివి జవహర్లాల్, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకృష్ణ, వై కమలాకర్, ఎం బాలాజీ, ఎం చంద్రశేఖర్, మునగాల రాంబాబుపరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. వర్షపు నీరు బయటకు పోయే విధంగా డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం వెంటనే ఆ దిశగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ముంపు బాధిత కుటుంబాలకు చేనేత కార్మికులకు 50 కేజీలు బియ్యం, రూ.పదివేల ఆర్థిక సహాయం అందించాలని కోరారు. చేనేత మగ్గాల గుంటల్లోకి నీళ్లు వచ్చాయని, దీని వలన నెలరోజుల పాటు పనిచేసుకోవడం కుదరదని అన్నారు.

మంగళగిరిలో టిడ్కోగృహాలను పరిశీలిస్తున్న నాయకులు

నీటమునిగిన పంట పొలాలను పరిశీలిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

పంట పొలాలు నీట మునగకుండా పంట పొలాల డ్రైనేజీ కాల్వకు రివిట్మెంట్ వాల్ నిర్మాణం చేపట్టి, ముంపు సమస్యను నివారించాలని సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు అన్నారు. ఆదివారం ఎంటిఎంసీ పరిధిలోని కుంచనపల్లి, గుండి మెడ, మెల్లెంపూడి గ్రామాలలో ముంపుకు గురైన పంట పొలాలను సిపిఎం నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ గతంలో మంగళగిరి శాసనసభ్యులు నిమ్మగడ్డ రామ్మోహన్ రావు ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో ప్రాతూరు రోడ్డు నుండి మేల్లంపూడి గ్రామం వరకు మురుగునీటి కాలువను పూడిక తీయించి, రైతుల పొలాలలో నీళ్లు నిలబడకుండా చేశారని అన్నారు. వడ్డేశ్వరం పరిధిలోని కేఎల్ యు యూనివర్సిటీ యాజమాన్యం మురుగునీటి కాలువకు అడ్డుకట్ట వేశారని తద్వారా మురుగునీటి బయటకు పోయే అవకాశం లేక పంట పొలాలని మునిగాయని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, రైతుల పంట పొలాలు ముంపుకు గురై దెబ్బ తినకుండా ఉండేందుకు తగువిధంగా చర్యలు చేపట్టాలన్నారు. సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ పంట పొలాల మురుగు కాలువలు సర్వే చేపట్టి , మెల్లంపూడి వద్ద బకింగ్ హెూం కెనాల్ లో మురికి నీరు కలిసే విధంగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా గుండి మెడ నుండి పిడబ్ల్యుడి కాలువ కట్టకు వెళ్లే రోడ్డు వద్ద మురుగునీరు పోయే విధంగా తూములు ఏర్పాటు చేసి, కల్వర్టు నిర్మాణం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కాజా వెంకటేశ్వరరావు, పల్లె కృష్ణ, అమ్మిశెట్టి సుధాకర్, జనార్ధన్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వెదసాగు వరి నీటమునిగిందని సిపిఎం నాయకులు తెలిపారు. దివారం నీటమునిగిన పంటపొలాలను మండలంలో సిపిఎం నాయకులు జెట్టిబాలరాజు, వై స్టాలిన్, వై బ్రహ్మేశ్వరరావు, అద్దంకి పాములు, దుర్గాప్రసాద్, నాగమణి తదితరులు పరిశీలించారు. వెదసాగు వరికి ఎకరాకు రూ.10వేలు నష్టం వచ్చిందని నాయకులు తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థ కాలువలు సక్రమంగా లేకపోవడం వల్లనే ముప్పు వస్తుందని, కూరగాయలు బెండలు వంకాయలు బొప్పాయి మెట్ట పొలాల్లో కూడా నీరు నిలిచిపోయాయని దీనివల్ల నష్టం కలిగే అవకాశం ఉందని తెలిపారు. పంట కాలవలను పూ డికలు తీసిముంపు నుంచి పంట పొలాలను కాపాడాలని కోరారు.

దుగ్గిరాలలో నీటమునిగిన పొలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

నీట మునిగిన వాణిజ్య పంటలు

ప్రజాశక్తి - కొల్లిపర

ప్రకాశం బ్యారేజీ నుండి ఆదివారం సుమారు 8 లక్షల నీరు దిగువకు విడుదల చేయడంతో మండలంలోని కృష్ణ పరివాహ ప్రాంతాల కరకట్టకు అవతలి వైపు కృష్ణా నది ఒడ్డున ఉన్న వాణిజ్య పంటలైన అరటి, పసుపు, కూరగాయపంటలు నీట మునిగాయి. తద్వారా పంటలు పాడై భారీ నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల

కృష్ణానది ఎగువ ప్రాంతాలైన మహారాష్ట్ర కర్ణాటక రాష్ట్రాలలో కురుస్తున్న వర్షాలకు వరద నీరు పోటెత్తుతున్నది . ఆదివారం సాయంత్రం ప్రకాశం బ్యారేజ్ నుండి 70 గేట్లు ఎత్తి ఎనిమిది లక్షల 42 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. దీంతో మండలంలోని వీర్లపాలెం పెద్ద కొండూరు గొడవర్రు గ్రామాల పరిధిలోని వాణిజ్య పంటలు సాగవుతున్న లంకపొలాల్లో వరద నీరు ప్రవహిస్తునంది. ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉంటే దుంప జాతికి చెందిన పసుపు కంద చేమ కూరగాయలు లాంటి పంటలకు తీవ్రంగా నష్టం జరిగే ప్రమాదం ఉందని రైతులు తెలుపుతున్నారు.

వరద నీటితో నీరుకొండ దిగ్బంధనం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి మండలం నీరుకొండ గ్రామం పూర్తిగా వరదనీరు దిగ్బంధనంలో ఉండిపోయింది. గత రెండురోజుల నుంచి కురిసిన వర్షానికి గ్రామ చుట్టుపక్కల వరద నీరు చేరింది. గ్రామం దాటి బయటికి వెళ్లడానికి గ్రామస్తులు భయపడుతున్నారు. టాక్టర్లు సహాయంతో వెళ్తున్నారు. పైనుండి కొండ వీటి వాగు నీరు కిందకు వస్తూ ఉండడంతో పొంగి పొర్లుతుంది. వరద నీరు తగ్గేవరకు గ్రామం నుండి బయటికి రావద్దని అధికారులు తెలుపుతున్నారు.

కొండపాటూరు వద్ద నల్లమడ వాగు కు గండిపడి పొలాల మీదకు పోతున్న నీరు

నల్లమడ వాగుకు గండి

ప్రజాశక్తి - పెదనందిపాడు

భారీ వర్షాలతో కాకుమాను మండలం కొండపాటూరు గ్రామంలో నల్లమడ వాగు గండిపడి పొలాల మీదకు పెద్ద ఎత్తున వరద నీరు ప్రవహించింది. గతంలో గండిపడినపుడు రైతు సంఘాలు ఆందోళన చేసినా , అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతులు ఇచ్చినా వారు స్పందించకపోవడంతో మళ్లీ గండి పడిందని రైతులు తెలుపుతున్నారు. ఈ సందర్భంగా ఎఒ సుధారాణి ముంపునకు గురైన పంటల విషయంలో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.

జెవివి పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక పసుమర్రులోని రాజేష్ మాస్టారు ట్యూషన్ సెంటర్లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జాతీయ పౌష్టికాహార వారోత్సవాల తొలిరోజు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. తొలుత ఇందుకు సంబంధించిన గోడపత్రికలను విద్యార్థులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెవివి పల్నాడు జిల్లా అధ్యక్షులు దార్ల బుజ్జిబాబు, చిలకలూరిపేట డివిజన్ ఉపాధ్యక్షులు ఉన్నవ రాజేష్ పౌష్టికాహార ఆవశ్యకతను వివరించారు. ఆపై విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించి బహుమతులు అందజేశారు. జేవివి ముద్రించిన కరపత్రాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బుజ్జిబాబు, రాజేష్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా ఉంటాం : టిడిపి

ప్రజాశక్తి - అమరావతి

తుఫాను కారణంగా పెదమద్దూరు గ్రామంలో ఎస్టీ కాలనీ యానాదుల నివాసగృహాలు వరదముంపునకు గురయ్యాయి. నిరాశ్రయులైన వారికి పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆదేశాల మేరకు బియ్యం పంపిణీ నిత్యవసర వస్తువులు పంపిణీ చేశారు. అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూ ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ పంచాయతీ పరిషత్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు చేతుల మీదుగా పంపిణీ చేశారు. తొలిసారి ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించి సెప్టెంబర్ 1 నాటికి 30 ఏళ్లుపూర్తయిన సందర్భంగా కేకులు కట్ చేసి పేదప్రజలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు పొదిలి శ్రీనివాసరావు, గ్రామపంచాయతీ సభ్యులు జాస్తి వెంకటేశ్వరరావు, బుడ్డి హరిబాబు, బూత్ కన్వీనర్లు అనిల్ కుమార్, జాస్తి నరసింహారావు, పొదిలి నరసింహారావు, పొదిలి సాంబశివరావు, పొదిలి మదన్ మోహన్, బుడ్డి శ్రీనివాసరావు పత్తిపాటి బాబి, గ్రామ పార్టీ నాయకులు అత్తోట జార్జి, వెంకటేశ్వర్లు నాయకులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపులో పక్షపాతం తగదు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

'ఆక్రమణలు తొలగింపు శాశ్వత ప్రాతిపదికన చేపట్టబోతున్నారా?. మురుగు నీటి కాలువలను శుభ్రం చేయటానికి లోపభూయిష్టంగా ఉన్న ఆటంకాలను తొలగిస్తున్నారా?. కాలువల మీద, ముందు ఆక్రమణలు తాత్కాలిక ప్రాతిపదికన తొలగిస్తున్నారా?. దీనివల్ల నష్టపోయిన వారికి జీవన మార్గాల కోసం ప్రత్యేకమైన ప్రణాళిక ఏమైనా సిద్ధం చేశారా?.' అంటూ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చిలకలూరిపేట ఇన్‌ఛార్జీ ఎం.రాధాకృష్ణ, పురపాలక సంఘ కమిషనర్, అధికారులను ప్రశ్నించారు. ఆదివారం ఆ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆక్రమణల తొలగింపు నిర్ణయం తీసుకునే ముందు ఈ అంశంపై ఆయాచోటు చిరు వ్యాపారాలు చేస్తున్న వారితో నిర్దిష్ట ప్రణాళికను వివరించి అనుసరిస్తున్న విధానాన్ని తెలియజేయాలన్నారు. చేతివృత్తులు చేసుకుని పొట్టపోసుకుంటున్న పేదలు నష్టపోతున్నారన్నారు. విలువైన ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని ప్రటలకు కష్టాలు పడుతున్న బడాబాబుల ఆక్రమణలను వదిలేసి పేదలను టార్గెట్ చేయడం తగదన్నారు. ఆక్రమణల తొలగింపులో నష్టపోయిన వారికి ప్రత్యామ్నాయ జీవన మార్గాలు చూపించాలని డిమాండ్ చేశారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారుల పరిశీలన

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని పంటలను ఏఓ ఆర్.రామారావు సిబ్బందితో కలిసి ఆదివారం పరిశీలించారు. కొచ్చర్ల, శ్రీనగర్, వనికుంట గ్రామాలలో నీరు అధికంగా ఉన్న వరి పైరును, వర్ష ప్రభావంతో దెబ్బతిన్న వరి నారుమళ్ళను సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. జాగ్రత్త చర్యలో భాగంగా ముందుగా పొలంలో అధికంగా ఉన్న నీటిని తీసివేసి 30 కిలోల యూరియా, 15 కిలోల ఎంఓపి వేసుకోవడంతో పాటు పొటాష్ తప్పనిసరిగా వేయాలన్నారు. అలాగే నేరుగా విత్తిన వరిలో నెల రోజుల లోపు మొక్కలు చనిపోతే ఒత్తుగా ఉన్నచోట మొక్కలు పీకి నాటుకోవాలన్నారు. ఎలుకల ఉధతి ఎక్కువగా ఉండే అవకాశం ఉంది కనుక నివారణ జాగ్రత్తలు పాటించాలన్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలం లింగంగుంట్ల పంచాయతీ పరిధిలోని రాజుపాలెం ఎస్సీ కాలనీలో వర్షపు నీరు వీధులు వెంట, ఇళ్లల్లోకి ప్రవహించి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతాన్ని పంచాయతీ కార్యదర్శి కెవి. శివ ప్రసాద్ ఆదివారం పరిశీలించి సహాయక చర్యలు చేపట్టారు. బాపనయ్య నగర్, ప్రకాష్ నగర్ లోని వర్షపు నీరు మరియు మురుగు నీరు కాలనీ పై పడి ముంచెత్తుతుందన్నారు.ఈ వర్షపు నీరు తాత్కాలికంగా బయటికి వెళ్ళటానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు శివప్రసాద్ తెలిపారు. శాశ్వత పరిష్కారం కోసం గతంలో అధికారులు నాయకుల దష్టికి కాలనీ వాసులు తీసుకెళ్లటం జరిగిందన్నారు.మున్సిపల్ అధికారులు, నాయకులు,రైతులు స్పందిస్తేనే శాశ్వత పరిష్కారం ఉంటుందని కాలనీ వాసులు వాపోతున్నారు.కాలనీలో అంటువ్యాధుల ప్రబలకుండా తక్షణ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కురుస్తున్న వర్షాలు దష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శివప్రసాద్ తెలిపారు.

ప్రజాశక్తి- మాచర్ల

అధిక వర్షాలకు మాచర్ల, చుట్టుపక్కల ప్రాంతాల వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వరద పరిస్థితిని ఆదివారం మాచర్ల తహశీల్దార్ జియా ఉల్‌హక్, మున్సిపల్ కమీషనర్ నాగేశ్వరరావు ఇతర అధికారులు కలసి పరిశీలించారు. వాగుల్లో పైనుంచి ప్రవాహవేగానికి కొట్టుకువస్తున్న చెట్లు, చెత్తా వంతెన ఖానాలకు అడ్డుపడి నీటి ప్రవాహం ఆగిపోకుండా జెసిబితో వాటిన తొలగిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఆదివారం సాయంత్రానికి వరద ఉధృతి కొంత తగ్గుముఖం పట్టింది. రాత్రికి తిరిగి వర్షం పడితే వాగు ఇంకా ఉధృతిగా ప్రవహించే అవకాశం ఉన్నందున వాగు పరిసర ప్రాంతాల్లో నివాసం ఉండేవారిని అప్రమత్తం చేస్తున్నట్లు తెలిపారు. ఏ ఇబ్బంది తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం వరకు 14.1సెం.మీ వర్షపాతం నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. వీరివెంట ఆర్ఐ శ్రీనివాసరావు, ఎలక్షణ్ డిటి బాషా సిబ్బంది ఉన్నారు.

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

కురుస్తున్న భారీ వర్షాలకు పైర్లకు నష్టం జరగకుండా రైతులు జాగ్రత్తలు పాటించాలని ఏడిఏ జగదీశ్వర్ రెడ్డి సూచించారు. ఆదివారం ఏడిఏ జగదీశ్వరరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ వర్షాలకు పొలాల్లో నీరు నిలబడితే పత్తిపైరు ఎర్రబారే అవకాశాలు ఉన్నాయన్నారు. వరదకాలువలు తీసి వర్షపు నీటిని పొలం నుండి తొలగించాలన్నారు.

మెమో 1214 రద్దు చేయాలి

ఎమ్మెల్యేకి వినతిపత్రం ఇస్తున్న భవన నిర్మాణ కార్మిక నాయకులు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

భవన నిర్మాణ కార్మిక సమస్యల పరిష్కారానికి అడ్డుగా ఉన్న మెమో నెంబర్ 1214 రద్దు చేయాలని పల్నాడు జిల్లా భవనం, ఇతర నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి షేక్ సిలార్ మసూద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో భనవ నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈయన అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలను కలుస్తున్నారు. అందులో భాగంగా చిలకలూరిపేటలోని స్థానిక పండరీపురం సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సమస్యలన్నీ పరిష్కారించాలన్నారు. దానికి అడ్డుగా ఉన్న మెమోను రద్దు చేయాలన్నారు. గత ఐదు సంవత్సరాలు సంక్షేమబోర్డు నిర్వీర్యం అయిందన్నారు. అప్పటి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న నారా చంద్రబాబునాయుడు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలన్నీ పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీలను ప్రస్తుత ముఖ్యమంత్రి నిలబెట్టు కోవాలని కోరారు. అన్ని సమస్యల పరిష్కారానికి జిల్లాకు సుమారు రూ.5 కోట్లా 90లక్షలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆనంతరం సిఐటియు మండల కార్యదర్శి పెరుబోయిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కొత్త లేబర్ కార్డులు 30 రోజుల్లో ఇవ్వాలని, సంక్షేమ బోర్డుని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మహిళ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం భవన నిర్మాణ కార్మికులతో కలసి శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు నివాసంలో మెమోరాండం ఇచ్చా రు. దానికి శాసన సభ్యులు పుల్లారావు స్పందించి గత ప్రభుత్వంలో కార్మికులకు భవన నిర్మాణ కార్మికులకు అనేక సమస్యలు పెండింగ్లో ఉన్న మాట వాస్తవమేనని ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వాన్ని గాడిలో పెట్టే పనిలో ఉన్నారని, తప్పక ఈ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యడ్లపాడు భవన నిర్మాణ కార్మికుల సంఘ అధ్యక్ష, కార్యదర్శి వెంకట్రావు, ఆంజనేయులు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

సిపిఎస్ రద్దుకు ఎస్‌టియు నిరసన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాకలెక్టర్ కార్యాలయంలో ఎదుట నరసరావుపేట పట్టణంలో ఎస్టీయూ ఆధ్వర్యంలో కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం కొనసాగించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు యల్ వి రామిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల హామీలలో భాగంగా మానిఫెస్టోలో రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వారంలో సిపిఎస్ రద్దు చేస్తానని హామీ ఇచ్చి జిపియస్ చర్చలతో కాలయాపన చేసిందని అన్నారు. రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు మాట్లాడుతూ పాత పెన్షన్ పథకం అమలు చేయాలని ఎటువంటి ప్రత్యామ్నాయ మార్గాలను ఎస్టీయూ అంగీకరించేది అన్నారు. రాష్ట్ర డైరీ కమిటీ కన్వీనర్ పాటు శ్రీనివాసరావు, జిల్లా గౌరవ అధ్యక్షులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించాలని ఏపిటిఎఫ్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపుమేరకు పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాత తాలూకా కేంద్రాలలో జరుగుతున్న నిరసన ప్రదర్శనలలో భాగంగా సత్తెనపల్లి తాలూకా కేంద్రంలో ఏపీటీఎఫ్ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎస్ కే ఎండి ఇబ్రహీం అధ్యక్షతన నిరసన ప్రదర్శన నిర్వహించారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - క్రోసూరు

తుఫాను , వరదల వలన ప్రబలే డయేరియా డెంగ్యూ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని క్రోసూర్ పిహెచ్‌సి వైద్య అధికారిని సిరి చందన, ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్‌లు అన్నారు. ఆదివారం పల్నాడు జిల్లా కోసూరు మండలం జిల్లా పరిషత్ హైస్కూల్లో వరద రిలీఫ్ క్యాంపు ఏర్పాటు చేశారు. అలాగే వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు ఈ మెడికల్ క్యాంపును పెదకూరపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పరిశీలించారు ఈ సందర్భంగా డాక్టర్ సిరి చందన, ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్‌లు వర్షం కారణంగా ప్రబలే వ్యాధులపై జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ ఋషి, ఆరోగ్య కార్యకర్త హైమావతి, ఆశా కార్యకర్తలు చంద్రిక, పావని, లక్ష్మి తదితరులు వైద్య సహాయం అందించారు.

రేషన్‌షాపు ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పేదల ఆకలి తీర్చే ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత పట్టిష్టపరిచి అవకతవకలకు తావు లేకుండా లబ్ధిదారులకు పంపిణీ చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. నరసరావుపేట పట్టణంలోని 6వ వార్డు రేషన్ దుకాణాన్ని ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిత్యావసరాల కోసం దుకాణం వద్దకు వచ్చిన లబ్ధిదారులతో సరుకులు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పేద ప్రజలకు నిత్యం అవసరం మైన సరుకులను పౌర సరఫరా వ్యవస్థ ద్వారా పంపిణీ చేసేందుకు ప్రభుత్వం కషి చేస్తుందని లబ్ధిదారులు ప్రభుత్వం చౌక దుకాణాల ద్వారా లభించే సరుకులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో గుత్తా అంకమ్మ చౌదరి, వాసిరెడ్డి రవి తదితరులు పాల్గొన్నారు.

లంకవాసులను ఖాళీ చేయించిన అధికారులు

ప్రజాశక్తి - తుళ్లూరు

తుళ్లూరు మండలంలోని కృష్ణా నదీ తీర ప్రాంతంలోని రాయపూడి పెదలంక తాళ్లా యపాలెం, ఉద్దండరా యునిపాలెం, వెంకటపాలెం లంక వాసులను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. సమీ పంలోని పాఠశాలల్లో ఆశ్రయం కల్పించారు. రాయపూడి పెదలంక వాసులను కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నం కు తరలించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ, ఎస్పి సతీష్ కుమార్, ఆర్డీవో గంగరాజు, మండల రెవెన్యూ,పోలీసులు వరద ప్రాంతాల్లో ఉన్నవారిని సురక్షిత ప్రాంతా లకు తరలించారు. సిఐ శ్రీనివాసరావు, టిడిపి తెలుగు యువత మండల అధ్యక్షులు మూల్పూరి నరేష్ లాంచీ లో రాయపూడి పెదలంకలో సురక్షిత ప్రాంతాలకు వెళ్లని వారికి నచ్చజెప్పి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. లంకవాసులు తరలింపు గురించి ఆదివారం మండలం లోని రాయపూడి వద్ద ఆర్డీవో గంగరాజు మాట్లాడుతూ, మండలంలో 5 లంకలు ఉన్నాయని, వాటిల్లో ఉద్దండ రాయుని పాలెం, తాళ్లాయపాలెం, వెంకటపాలెం లంకవాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించడం జరిగిందని అన్నారు. హరిశ్చంద్ర పురం కు సంబంధించి ఇబ్బంది లేదని అన్నారు. ఆదివారం మధ్యాహ్నం సమయానికి పులిచింతల నుంచి 6.50 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు చేరిందని,10 లక్షల క్యూసెక్కుల వరకు వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

వెంకటపాలెంలో వరద బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్

అండగా ఉంటాం : ఎమ్మెల్యే

సహాయ శిబిరాలలో ఆశ్రయం పొందు తున్న వారిని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ పరామర్శించారు. బాధితులకు అండగా ఉంటామని చెప్పారు. వెంకటపాలెం, తాళ్లాయపాలెం లో సహాయ శిబిరాలలో ఉంటున్న వారికి ధైర్యం చెప్పారు.

గుంటూరులో పెమ్మసాని, నశీర్ పర్యటన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

భారీ వర్షాలు వలన గుంటూరు నగరపాలక సంస్థ తూర్పునియోజకవర్గం పరిధిలో ముంపుకు గురైన లోతట్టు ప్రాంతాలను ఆదివారం కేంద్ర గ్రామీణభివద్ధి , కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ , నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివా సులు, తూర్పు నియోజకవర్గ శాసన సభ్యులు మహ్మద్ నసీర్ అహ్మద్ తో కలసి పరిశీలించారు. పాతగుంటూ రులోని ఎల్బీ నగర్, ప్రగతి నగర్, సుద్దపల్లి డొంక, జూన్ షాహెద్ ప్రాంతాలలో పర్యటించారు. ప్రగతినగర్ , జూన్ షాహెద్ ప్రాంతాల్లో వర్షం నీటిలోనే కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, శాసనసభ్యులు నసీర్ అహ్మద్, కమిషనర్ పులి శ్రీనివాసులు నడుచుకుంటూ వెళ్ళి వర్షం నీరు చేరిన ఇళ్ళను పరిశీలించి, స్థానికులతో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకున్నారు. బాదితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, అవసరమైన సహాయ సహకారాలు పూర్తి స్థాయిలో అందిస్తామని భరోసా కల్పించారు.

నీటమునిగిన పొలాలు పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చేబ్రోలు

మండలంలోని వేజెండ్ల, సుద్దపల్లి, శేకూరు గ్రామాలలో నీట మునిగిన పొలాలను ఎమ్మెల్యే ధూళిపాళ్ల న రేంద్ర పరిశీలించారు. కాలువలను మరమ్మతులు చేయకుండా గత వైసిపి ప్రభుత్వం ఐదేళ్లు రైతుల్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందన్నారు. దీనివల్లనే రైతులు పంట నీరు పెట్టుకోవాలన్నా, విపత్తుల సమయంలో మురుగునీరు బయటకు పారించు కోవాలన్నా, కాలువలు మరమ్మతులు లేకపోవడం వల్ల నేడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అన్నారు. వీలైనంత త్వరగా కాలువలు మరమ్మతులు చేయించి రైతులకు ఇబ్బంది లేకుండా చేస్తామని హామీ ఇస్తున్నామని అన్నారు. శేకూరు గ్రామం పరిధిలోని తుంగభద్ర డ్రైన్ లో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న గుర్రపు డెక్క ఆకును తూటికాడను తొలగించాలని అధికారులను ఆదేశించడంతో అప్పటికప్పుడే తూటికాడను తొలగించడం జరిగింది. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు ఏ డి ఏ పొన్నూరు, ఏవో చేబ్రోలు, ఉద్యానవన వ్యవసాయ సహాయకులు పొన్నూరు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త వడ్రాణం మార్కండేయబాబు ,చేబ్రోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మైలా వెంకట రామరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్

అల్పపీడనం కారణంగా పంట నష్టపోయిన రైతులు ముందుగా పొలాల్లో నిలిచిన నీటిని బయటకు వదిలే ప్రయత్నాలు చేపట్టాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం తెనాలి మండలం గోళిడొంక, తేలప్రోలు, నేలపాడులో నీటమునిగిన పొలాలను మండల వ్యవసాయ సహాయ సంచాలకులు ఉషారాణితో కలసి పొలాలను పరిశీలించారు. నీట మునిగిన పంటలకు తీసుకోవల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో తెనాలి ఎఓ జి ప్రేమ సాగర్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివ సాంబిరెడ్డి, రైతులు, కౌలు రైతులు పాల్గున్నారు.

ముంపు ప్రాంతాల్లో భోజనం ఏర్పాటు

ప్రజాశక్తి-దుగ్గిరాల: ముంపునకు గురైన ప్రాంతాలలో యుద్ధ ప్రాతిపదికన పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. చెన్నకేశవ నగర్ లో జెసిబి తో మురుగు కాలువలు శుభ్రం చేస్తుండగా ఆదివారం స్థానిక దళిత వాడ వద్ద తూములు వేస్తున్నారు. టిడిపి నాయకులు శనివారం రాత్రి ముంపుకు గురైన ప్రాంతంలో బాధితులకు భోజన సదుపాయాలు ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం పులిహోర ఉప్మా అందించగా మధ్యాహ్నం అన్న క్యాంటీన్లో భోజనా లు ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి భోజనాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొల్లూరు నరసింహారావు పర్వతనేని హర్ష నక్క చిరంజీవి గణేష్ మరియు బాణావతి వెంకటేశ్వర నాయక్ పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాలను పరిశీలించిన తహశీల్దార్

ప్రజాశక్తి - తెనాలి :భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమ య్యాయి. రూరల్ గ్రామం బుర్రిపాలెం యానాది కాలనీ లో 50 కుటుంబాలకు చెందిన నివాసాలలో వర్షపు నీరు చేరింది. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాల మేరకు అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. మండల తహశీల్దార్ కె.వి గోపాలకృష్ణ గ్రామాన్ని పరిశీలించారు. వర్షపు నీరు ఇళ్లలోకి చేరి ఇబ్బంది పడుతున్న 50 కుటుంబాలకు చెందిన 150 మందిని గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పునరావాస కేంద్రానికి తరలించారు. అక్కడ వారికి భోజన వసతి సౌకర్యాలను కల్పించారు. అలాగే వైద్య శిబిరం కూడా ఏర్పాటు చేశారు. వర్ష ప్రభావం తగ్గేంతవరకు వారికి సహాయక చర్యలు కొనసాగుతాయని తహశీల్దార్ తెలిపారు. విఆర్వోలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

పునరావాస కేంద్రాలలో మెడికల్ క్యాంపులు

ప్రజాశక్తి-దుగ్గిరాల : అధిక వర్షాలకు దుగ్గిరాల ఈమని గ్రామాలలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలలో ఆదివారం మెడికల్ క్యాంపులు నిర్వహించారు. దుగ్గిరాల చెన్నకేశవ నగర్ ఎలిమెంటరీ పాఠశాలలో స్థానిక పి హ సి వైద్యాధికారి అబ్దుల్ రెహమాన్ ఏమని జిల్లా పరిషత్ హై స్కూల్ ల ఏర్పాటు చేసిన పునరా వాస కేంద్రంలో ఈమని వైద్యాధికారిని డాక్టర్ రహీ మున్ని సా ఆధ్వర్యంలో ఈ క్యాంపులు నిర్వహించారు. దుగ్గిరాల లోని పునరావాస కేంద్రంలో 70 మంది ఈ మని లోని పునరావాస కేంద్రంలో వంద మంది బాధితులు ఉన్నారు.

సర్వారెడ్డి వర్ధంతి సభ

ప్రజాశక్తి-తాడేపల్లి : సిపిఐ తాడేపల్లి పట్టణ నాయకులు బుర్రముక్కు సర్వారెడ్డి వర్ధంతి సభ తాడేపల్లి ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. తాడేపల్లి సిపిఐ సహాయ కార్యదర్శి టి.వెంకటయ్య అధ్యక్షతన జరిగిన సభలో మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చినతిరుపతయ్య, సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య మాట్లాడుతూ తాడేపల్లి ప్రాంతాల్లో సర్వారెడ్డి పేదల కోసం పని చేశారని నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి మండల కార్యదర్శి కె.జాన్‌బాబు, సీనియర్ నాయకులు డాంగే, ఎం.రామారావు, ఎస్‌కె ఖాశీం, ఎస్‌కె బాష, ఎ.సురేష్, సిహెచ్.ప్రసాద్, ఎం.చిన్న తదితరులు పాల్గొన్నారు.

400 మందికి భోజన ప్యాకెట్లు పంపిణీ

ప్రజాశక్తి మంగళగిరి : మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో గుంటూరు పార్లమెంట్ పద్మశాలి సాధికార కమిటీ సభ్యులు జొన్నాదుల బాలకృష్ణ ఆర్థిక సహకారంతో 400 మందికి ఆదివారం మధ్యాహ్నం భోజనం ప్యాకెట్లు మంగళగిరి పట్టణంలోని 3, 4, 5 వార్డుల్లో భారీ వర్షాల వలన ఉపాధి కోల్పోయిన పేదలకు పంపిణీ చేశారు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకురాలు టి జానకి దేవి,తెలుగుదేశం పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు వాకా మాధవరావు, ఎం ప్రసన్న వెంకటేశ్వరరావు, రాష్ట్ర సాధికార సమితి సభ్యులు అన్నం నాగబాబు, పట్టణ ఎస్టీ సెల్ అధ్యక్షుడు పేరం ఏడుకొండలు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని పరిరక్షించుకోవాలి

ప్రజాశక్తి-తెనాలి :ఉత్తమ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, విద్యారంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పలువురు వక్తలు చెప్పారు. స్థానిక టి.బి రోడ్ లోని తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఆదివారం ఉదయం ఉపాధ్యాయుడు కనపర్తి బెన్‌హర్ పదవీ విరమణ సభను పోస్టల్ సంఘ నాయకులు డి. నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. నిబద్ధతతో పదవీకాలం పూర్తి చేసిన బెన్హర్‌ను అభినందించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు బెన్‌హర్ రచించిన 'అంతరాలు లేని సమాజం కోసం' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యా వ్యవస్థపై లక్ష్మణరావు మాట్లాడుతూ వ్యవస్థలో మార్పుకు అనుగుణంగా విద్య వ్యవస్థను సమిష్టిగా పరిరక్షించుకోవాలన్నారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఆదర్శ భావాలతో జీవనం గడిపిన బెన్హర్ ఉపాధ్యాయ వృత్తి కే వన్నె తెచ్చారని కొనియాడారు. మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, ఇస్రో మాజీ సైంటిస్ట్ చందు సాంబశివరావు, సీపీఐ రాష్ట్ర నాయకులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, చెరుకుమల్లి సింగారావు, దళిత యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య గుజ్జర్ల మూడి కృపాచారి ప్రసంగించారు. కార్యక్రమంలో బొల్లిముంత కృష్ణ, డాక్టర్ కె. అబ్రహంలింకన్, దానియేలు, కార్డ్ సంస్థ ప్రతినిధులు, ఎస్టీయు నాయకులు, పలు ప్రజా సంఘాల,ఉద్యమ సంఘాల నాయకులు, పలు జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులు, కవులు, కళాకారులు, బెన్ హర్ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఆలపాటి, సిపిఐ నాయకులు

నమూనాలు పరిశీలిస్తున్న పార్థసారథి తదితరులు

అబ్బురపరచిన ఎఐ ఆవిష్కరణలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అమరావతి రోడ్డు ఏ కన్వెన్షన్‌లో యూనివర్సల్ కాన్సెప్ట్ ఆఫ్ మెంటల్ అర్థమెటిక్ సిస్టం (యుసి మాస్) విద్యార్థులు తమ మెదళ్లకు పదును పెట్టి తయారుచేసిన రోబోటిక్స్ చంద్రయాన్, అగ్రికల్చర్ రోబో, సెల్ఫ్ డ్రైవింగ్ కార్, స్మార్ట్ విలేజ్, క్యారం రోబోట్ వంటి వందలాది నమూనాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కేఎల్ యూనివర్సిటీ బేసిక్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ పి.పార్థసారథి మాట్లాడుతూ చిన్న వయసులోనే రోబోటిక్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అబాకస్ వంటి సాంకేతిక విద్యను పిల్లలలో నేర్పించడం ద్వారా భవిష్యత్తు మేధో సంపన్న శాస్త్రవేత్తలుగా రాణిస్తారన్నారు. శ్రీరైన టెక్నాలజీస్ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల చైర్మన్ డాక్టర్ ఎన్.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఆధునిక ప్రపంచం భవిష్యత్తు సాంకేతిక నైపుణ్యాలతోనే ముడిపడి ఉందని చెప్పారు. యూసీమాస్ శిక్షణ ద్వారా ఆరు సంవత్సరాల వయస్సు నుండి 18 సంవత్సరాల విద్యార్థులకు 500కు పైగా రోబోట్ మోడల్స్‌పై కోడింగ్ ప్రోగ్రాంలలో శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా రోబోటిక్స్, గణితంలో అబాకస్ మూడు సంవత్సరాల శిక్షణల ద్వారా ప్రత్యేక గ్రాడ్యుయేషన్ విద్యార్థులుగా తీర్చిదిద్దుతున్నట్లు వివరించారు. వీవీఐటీ ప్రొఫెసర్ డివి శేషగిరిరావు, పీపుల్స్ ట్రామ డాక్టర్ కే.వెంకటేశ్వర్ రెడ్డి, విశ్రాంత ఎంఈఓ ఓవి రామిరెడ్డి, ప్రదర్శనలు తిలకించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో బిజినెస్ హెడ్ ఎం.శ్రీకాంత్ టెక్నికల్ మోడరేటర్స్ రమా, పూజ, నందిని, మహాలక్ష్మి, లీలామణి, జోష్న, జ్యోతి, జీవన తదితరులు పాల్గొన్నారు

వాగులో తూటికాడ తొలగింపు

ప్రజాశక్తి-తాడేపల్లి

మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు కొండవీటి వాగులో తూటుకాడ తొలగింపు చేపట్టినట్లు తెలుగు యువత గుంటూరు పార్లమెంట్ అధ్యక్షులు జంగాల వెంకటేష్ తెలిపారు. ఇరిగేషన్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ తెలుగు యువత, రైతులు జెసిబితో తొలగించిన తూటుకాడను ట్రాక్టర్‌తో వేరేచోటకు తరలించారు. దీని వల్ల ఉండవల్లి, పెనుమాక, యర్రబాలెం పంట పొలాల్లోకి వరద నీరు వెళ్లకుండా అడ్డుకోగలిగామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు సిహెచ్.రాజారమేష్, రాము, జి.మణికంఠ, లీలాకృష్ణ, ఎస్.బుచ్చిబాబు, శివుడు, రామారావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నాగరత్నమ్మకు నివాళులర్పించిన సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - మంగళగిరి : మంగళగిరి పట్టణంలోని గండాలయ పేటలో కొండ రాయి విరిగిపడి మతి చెందిన నాగరత్నమ్మ కు సిపిఎం నాయకులు జేవీ రాఘవులు, వివి జవహర్లాల్, వై కమలాకర్, పి బాలకృష్ణ, ఎం బాలాజీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పేదలను ఆదుకోవాలి : వైసిపి

ప్రజాశక్తి - మంగళగిరి

గత రెండు రోజులుగా కురిసిన వర్షాల వలన పనులు కోల్పోయి, ఇబ్బందులు పడుతున్న రత్నాల చెరువు ప్రాంతాన్ని ఆదివారం ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్ఆర్ సిపి చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షులు గంజి చిరంజీవి, వైఎస్ఆర్సిపి నాయకులు డి వేమారెడ్డి సందర్శించారు. మగ్గాలగుంటలోకి నీళ్లు వచ్చిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలు వాళ్ళని ఇబ్బంది పడుతున్న వారిని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కోరారు. నిత్యవసర వస్తువులు, ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

నేడు కాలేజీలు, పాఠశాలలకు సెలవు

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున జిల్లాలో జూనియర్ కాలేజిలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సోమవారం సెలవు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు మేనేజ్‌మెంట్స్ ఆధ్వర్యంలోని విద్యా సంస్థలు అన్నింటికీ ఈ ఆదేశాలు వర్తిస్తాయన్నారు.

ఎటి అగ్రహారంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే గల్లా మాధవి

ఆట ముగిసింది...శ్వాస ఆగింది

స్టేడియంలోనే కుప్పకూలిన షటిల్ ప్లేయర్

ప్రజాశక్తి-తెనాలి

అతనో క్రీడాకారుడు. ఆటలంటే అతనికి ప్రాణం. చివరి నిమిషం వరకూ ఆడుతూనే ఉండాలి. ఆడుతూనే శ్వాస ముగించాలి అని పలుమార్లు సహచర క్రీడాకారులతో పదే పదే చెప్పేవారు. అలాగే ఆట ముగిసింది. అదే క్షణంలో శ్వాస ఆగింది. అప్పటి వరకూ ఆటలో పోటీ పడిన ఆయన అదే స్టేడియంలో తుది శ్వాస విడిచారు. తోటి క్రీడాకారులను, కుటుంబ సభ్యులను శోక సంద్రంలో ముంచిన షటిల్ బ్యాట్మింటన్ క్రీడాకారుడు పోచిరాజు వెంకట రాంబాబు వివరాలిలా ఉన్నాయి. రూరల్ గ్రామం కొలకలూరుకు చెందిన పోచిరాజు వెంకటరాంబాబు (56) మంచి క్రీడాకారుడు. క్రికెట్, షటిల్ బ్యాట్మింటన్ అంటే అతనికి ప్రాణం. ట్యూషన్ టీచర్‌గా గ్రామంలో జీవితాన్ని ప్రారంభించిన ఆయన తెనాలి వహాబ్ రోడ్డు లోని సంస్కార్ పాఠశాల్లో ఉపాధ్యాయునిగా సుధీర్ఘకాలం పని చేశారు. కాలక్రమంలో పౌరోహిత్యం నేర్చుకుని పురోహితునిగా జీవనం సాగిస్తున్నారు. కొత్త ఐజక్‌శ్యామ్ బ్యాట్మంటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా ఉన్న ఆయన ప్రతి రోజు ఉదయం షటిల్ బ్యాట్మింటన్ ఆడటం అతని దినచర్యలో భాగం. ఆక్రమంలోనే వర్షం కారణంగా కిస్బా కోర్టు జలమయం కావటంతో తెనాలి ఇండోర్ స్టేడియంకు వెళ్ళారు. అక్కడ డబుల్స్ గేమ్ ప్రత్యర్ధులతో పోటీ పడ్డాడు. ఇరు జట్లు చెరో సెట్ గెలవగా మూడో సెట్‌లో పోటీ పడ్డారు. ఆట ముగిసింది. ఇరు జట్లు కోర్టు నుంచి అడుగు బయటపెడుతుండగానే రాంబాబు కుప్పకూలిపోయాడు. అక్కడే ఉన్న తోటి క్రీడాకారులు స్పందించి, పసర్యలు చేశారు. క్షణాల్లో కూత వేటు దూరంలో ఉన్న తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించటంతో క్రీడాకారులంతా గొల్లుమన్నారు. అప్పటివరకూ తమతో చలాకిగా ఆడిన మిత్రుడు విగత జీవిగా మారటాన్ని వారు జీర్ణించుకోలేకపోయారు. కుటుంబసభ్యులు శోక సంద్రంలో మునిగిపోయారు. ఆయన మృతికి కిస్బా అధ్యక్ష కార్యదర్శులు టి.రవీంద్రబాబు, ఎస్.వినయకుమార్, సభ్యులు కె.జార్జిథామస్, ఎస్‌కె కరిముల్లా, కె.కిరణ్మయి. ఎస్.మురళీధర్, పి.సురేష్‌బాబు, కె.శ్రీకాంత్, వసంతరావు, సిహెచ్ నాగరాజు, సత్యనారాయణ, శివ సంతాపం వ్యక్తం చేశారు.

పోచిరాజు వెంకట రాంబాబు (ఫైల్‌ఫొటో)

మీ బాధ ఎవరూ తీర్చలేనిది - విద్యా సంస్థలపై చర్యలు

చిన్నారుల కుటుంబాలను పరామర్శించిన పెమ్మసాని

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

'మీ బాధ ఎవరూ తీర్చలేనిది. స్కూల్ యాజమాన్యం బాధ్యత వహించాలి. ప్రైవేట్ స్కూల్లలో నిర్వహణ లోపం పై చర్యలు తీసుకునే బాధ్యత నాది.' అని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ భరోసా ఇచ్చారు. జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఉప్పలపాడు గ్రామ శివారులోనీ వాగులో జరిగిన కారు ప్రమాదం తెలిసిందే. ఘటనలో మృతి చెందిన చిన్నారులు మాన్విక్ (9) కుటుంబాన్ని పెమ్మసాని ఆదివారం పరామర్శించారు. మాన్విక్ అమ్మమ్మ, తాతయ్యలతో మాట్లాడి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. స్కూలుకు వెళ్లిన తమ మనవడిని తిరిగి ఇంటికి పంపించే క్రమంలో కనీసం సమాచారం ఇవ్వలేదని ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ఆరోపించారు. పిల్లల విషయంలో కనీస జాగ్రత్త కూడా తీసుకొని కారణంగానే ఈ ప్రమాదం ఎదురైందని కన్నీటి పర్యంతమయ్యారు. బాధలో ఉన్న కుటుంబీకులను ఓదార్చిన పిమ్మట పెమ్మసాని మాట్లాడుతూ ఈ బాధ ఎవరు తీర్చలేనిదని, ప్రైవేట్ స్కూళ్ల నిర్వహణపై తాను చర్యలు తీసుకుంటానని తెలిపారు. అనంతరం మంత్రి విలేఖరులతో మాట్లాడుతూ స్కూల్ యాజమాన్యం నుంచి సరైన కమ్యూనికేషన్ లేని కారణంగా ప్రమాదం ఎదురైనట్లుగా కుటుంబ సభ్యులు తనకు వివరించారని చెప్పారు. ప్రతి ఒక్కరికి అకౌంటబిలిటీ ఉండేలా చర్యలు తీసుకుంటానని అన్నారు. అలాగే గుంటూరు ఛానల్ లీక్ అయిన కారణంగా వర్షం నీరు గ్రామాల్లోకి చేరుతుండటంపై అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని వివరించారు. కాగా మృతి చెందిన చిన్నారుల కుటుంబాలకు నష్టపరిహారం కింద ప్రభుత్వం ప్రకటించిన రూ. 5 లక్షలను పెమ్మసాని అందజేశారు. స్థానిక తహసిల్దార్ టి. కృష్ణ కాంత్, ఎంపిటిసి శ్రీనివాసరావు, సర్పంచ్ కర్నాటి శ్రీనివాసరావు, దుద్దుకూరి బూషి బాబు తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపి పెమ్మసాని చంద్రశేఖర్

ప్రణాళికా లోపంతోనే ముంపు సమస్యలు

మోటార్ల సాయంతో నీళ్లు తోడాలని అధికారులకు ఎమ్మెల్యే మాధవి ఆదేశాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రణాళికా లోపంతోనే ముంపు సమస్యలు ఏర్పడ్డాయని ఎమ్మెల్యే గళ్ళా మాధవి వ్యాఖ్యానించారు. శుక్రవారం నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా గుంటూరు నియోజకవర్గ పరిధిలోని వరద ప్రభావిత ప్రాంతాలు శ్రీనివాసరావు పేట, శాంతి నగర్, లక్ష్మి నగర్, రామిరెడ్డి నగర్, 60అడుగుల రోడ్డు, గౌతమి నగర్,ముత్యాల రెడ్డి నగర్, అంబేద్కర్ నగర్, కొబాల్డ్ పేట, దేవాపురం, పట్టబిపురం, వడ్డే గూడెం, చుట్టగుంట,కే.వి.పి కాలనీ, ఏటి అగ్రహారం, హౌసింగ్ బోర్డు కాలనీ, నల్లచెరువు ప్రాంతాల్లో ఎమ్మెల్యే గళ్ళా మాధవి పర్యటించారు. భారీగా నష్టపోయిన పలు పేదల కుటుంబాలకు వ్యక్తిగతంగా రూ.10వేలు చొప్పున ఆర్థిక సహాయంగా పలువురికి అందజేశారు. ఏటి అగ్రహారం ప్రధాన రోడ్డులో మోకాళ్ళ లోతు నీటిలో నడుస్తూ, నీళ్ల చేరిన ఇళ్లలోకి వెళ్లి ప్రజల్ని పరామర్శించారు. ఇంత భారీగా నీరు చేరటానికి ప్రణాళిక లోపమే ప్రధాన కారణమని వెంటనే అధికారులు యంత్రాలను ఉపయోగించి నీటిని తోడాలని ఆదేశించారు. అదేవిధంగా దేవాపురంలో సైడు కాలువలను ఆక్రమించి, నిర్మాణాలు చేపట్టటం వలన నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడి ఇళ్లలోకి నీరు చేరినట్లు ఎమ్మెల్యే గుర్తించి, వెంటనే ఈ ఆక్రమణలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. నల్ల చెరువులో సరైయిన డ్రైనేజీ నిర్మాణాలు లేకపోవటం వలనే ఈ పరిస్థితి వచ్చిందని, గత పాలకులు, అధికారులు ఎందుకు వీటి మీద దృష్టి పెట్టలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుండి డ్రైనేజీ మరియు సిల్టేషన్ తొలగింపు మీద దృష్టి పెట్టానని, సిబ్బంది కొరత మరియు ఇతర కారణాలతో ఆశించిన స్థాయిలో పనులు జరగలేదని తానూ భావిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. శానిటేషన్ విషయాన్ని తానూ సిరియస్‌గా తీసుకుంటున్నానని, ఇప్పటికే ఈ విషయాన్ని నగర మునిసిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లానని ఎమ్మెల్యే తెలిపారు. గత మునిసిపల్ కౌన్సిల్ సమావేశాల్లో అన్ని డివిజన్ లలో సైడ్ డ్రైన్ల నిర్మాణాలు చేపట్టాలని ప్రతిపాదించానని, లోతట్టు ప్రాంతాల విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకోబోతున్నట్లు గళ్ళా మాధవి తెలిపారు.

యుద్ధ ప్రాతిపదికన వర్షపు నీటిని తొలగించాలి : సిపిఎం

ప్రజాశక్తి-గుంటూరు

వర్షపు నీరు ఇళ్ళల్లోకి వచ్చి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన నీళ్ల పంపించే చర్యలు సత్వరం చేపట్టాలని సిపిఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలో వర్షపు ముంపు ప్రాంతాల్లో సిపిఎం నగర నాయకత్వం పర్యటించింది. పాత గుంటూరు ప్రాంతంలోని శ్రామిక నగర్, చంద్రయ్య కాలనీ, శివారు ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక వర్షపు నీటితో పాములు, తేళ్లు, విషపురుగులు ఇళ్లల్లోకి వస్తున్నాయని, ప్రజలు తీవ్ర భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. బిఆర్ స్టేడియం స్థలంలో గతంలో మెరక తోలుతూ ప్రక్కనే ఉన్న శ్రామిక నగర్ డ్రైనేజీ కాలవను పూడ్చి వేశారని దీంతో శ్రామిక నగర్ కాలనీలోని ఇళ్లల్లోకి నీళ్లు వస్తున్నాయన్నారు. వెంటనే సైడ్ కాలువ తవ్వి వర్షపు నీటిని మళ్లించాలని కోరారు. చంద్రయ్య కాలనీ పక్కన ఉన్న చెరువుకు గండిపడి కాలనీలోని ఇళ్లలోకి నీళ్లు వచ్చాయని తెలిపారు.

బాధితులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు నళినికాంత్ తదితరులు

జన్మభూమి నగర్‌లో పైనుండి వచ్చిన వర్షపు నీటి ఉధృతికి మెయిన్ రోడ్డు కోసుకు పోయి డ్రైనేజీ కాలువ గోడ పగిలిపోయిందని, వెంటనే బాగు చేయించాలని కోరారు. ఎన్‌జిఒ కాలనీలో కోన బాల ప్రభాకర్‌రావు హైస్కూల్లో వర్షపు నీరు బయటకు పోవటానికి మార్గం లేదు అని అన్నారు. పటిష్టమైన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి భవిష్యత్తులో ఇలాంటి సమస్య పునరావృతం కాకుండా చూడాలని కోరారు. పర్యటనలో సిపిఎం నగర నాయకులు కె శ్రీనివాసరావు, బి.ముత్యాలరావు, ఎల్.అరుణ, షేక్.ఖాశింషహీద్, ఆది నికల్సన్, షేక్ ఖాశింవలి, షేక్.మస్తాన్‌వలి, టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రామికనగర్‌లో పర్యటించిన కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

నగరంలో లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన వర్షపు నీటిని తొలగించడానికి చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అధికారుల్ని ఆదేశించారు. ఆదివారం బిఆర్ స్టేడియం, శ్రామి క నగర్, ముగ్దుం నగర్, బాలాజీ నగర్ మొండి గేటు ప్రాంతాల్లో పర్యటించి, ఆయా ప్రాంతాల్లో నిలిచిన వర్షం నీటిని వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. బాలాజీ నగర్ దగ్గరలోని మొండి గేటుని పరిశీలించారు.మొండిగేటు వద్ద డ్రైన్‌కు ఎలాంటి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బిఆర్ స్టేడియంలో నిలిచిన నీటిని పరిశీలించి, స్టేడియం వెలుపల ప్రతిపాదనలో ఉన్న డ్రైన్ నిర్మాణ పనులను చేపట్టాలని ఏఈని ఆదేశించారు. స్టేడియం అధికారులతో సమన్వయం చేసుకొని స్టేడియం లోపల డ్రైన్, వెలుపల ప్రతిపాదించిన డ్రైన్ లెవల్స్ సరి చూసుకోవాలన్నారు. శ్రామిక నగర్‌లో ఇళ్లల్లోకి వర్షం నీరు వచ్చి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలుపగా, పరిశీలించి వెంటనే కచ్చా కాల్వ ఏర్పాటు చేసి నీటిని తొలగించాలన్నారు. పర్యటనలో ఎస్ఈ శ్యాం సుందర్, ఈఈ కోటేశ్వరరావు, డిఈఈ శ్రీధర్, ఏఈ సునీల్ కుమార్, ఎస్ఎస్ ఆయుబ్ ఖాన్, కార్పొరేటర్లు మహమూద్, మీరావలి, చిష్టి పాల్గొన్నారు.

శ్రామిక నగర్‌లో పర్యటిస్తున్న కమిషనర్

డ్రెయిన్ల ఆక్రమణలను వెంటనే తొలగించాలి

ప్రజాశక్తి-గుంటూరు : గుంటూరు నగరంలో డ్రైన్లపై ఇష్టానుసారం ఆక్రమణలు చేస్తున్నారని, ఫలితంగా ప్రస్తుత వర్షాలకు డ్రైన్లు బ్లాక్ అయ్యి, వర్షం నీరు ఇళ్లల్లోకి, లోతట్టు ప్రాంతాలకు చేరి స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం జిటిరోడ్, శ్రీనివాసరావుతోట, పాతగుంటూరు, బాలాజీ నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి, డ్రైన్ల ఆక్రమణలపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసి, వెంటనే తొలగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో డ్రైన్లపై ఆక్రమణలను పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు సమన్వయంతో తొలగించాలన్నారు. ప్రధాన డ్రైన్లను కూడా వివిధ వ్యాపారాల పేరుతో ఆక్రమణ చేసుకొని, వ్యాపార వ్యర్థాలు డ్రైన్లలో వేస్తుంటే అధికారులు ఏమి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం నాటికి ఆక్రమణలు తొలగించాలని లేకుంటే సంబంధిత అధికారులు, సచివాలయ కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు కూడా తమ వ్యాపార సముదాయాలను తప్పనిసరిగా డ్రైన్‌కి వెనుక వైపు మాత్రమే ఏర్పాటు చేసుకోవాలని, ఇక నుండి డ్రైన్ల మీద, డ్రైన్‌కి ముందుకు వచ్చి ఏర్పాటు చేసుకుంటే వెంటనే తొలగిస్తామన్నారు. అనంతరం లాల్‌పురం రోడ్డులోని ఓ పెట్రోల్ బంక్‌లో మీటర్ ఏర్పాటు చేయడానికి ముందే ట్యాప్ కనెక్షన్ చేసి ఉండడం గమనించి, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం ట్యాప్ కనెక్షన్ తొలగించాలని, నిబంధనల మేరకు విధులు నిర్వహించకుండా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పర్యటనలో ఎస్.ఈ. శ్యాంసుందర్, ఎంహెచ్ఓ మధుసూదన్, ఈఈ సుందరరామిరెడ్డి, కోటేశ్వరరావు అధికారులు పాల్గొన్నారు.